
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి



బుధవారం ఉష్ణోగ్రత ఖమ్మం: గరిష్ఠం 31 । కనిష్ఠం 20 భద్రాద్రి: గరిష్ఠం 30 । కనిష్ఠం 20 గురువారం, 1 ఫిబ్రవరి 2024 5

ఇక పల్లెల్లో ప్రత్యేక పాలన



- ఇరు జిల్లాల్లో అధికారుల నియామకం పూర్తి
- ప్రభుత్వం జీవో ఇవ్వగానే బాధ్యతల స్వీకరణకు సిద్ధం
- సర్పంచ్‌లనుంచి డిజిటల్ కీలు, రికార్డులు వాపస్

ఖమ్మం కలెక్టరేట్/చుంచుపల్లి, జనవరి 31: గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌ల పదవీకాలం ముగిసింది. వారి స్థానంలో ప్రత్యేక అధికారులు బాధ్యతలు చేపట్టనున్నారు. ఇప్పటికిప్పుడు రాష్ట్రంలో పంచాయతీలకు ఎన్నికలను నిర్వహించేందుకు అవకాశం లేకపోవడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులతో పంచాయతీల పాలన కొనసాగించనుంది. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 589 పంచాయతీలకు కలెక్టర్ వీపీ గౌతమ్ ప్రత్యేక అధికారులను నియమించారు. ఈ మేరకు గురువారం ఉదయం ఉత్తర్వులు ఇచ్చి తక్షణమే విధుల్లో చేరాలని ఆదేశించనున్నారు. జిల్లాలో ఐదు విలీన పంచాయతీలు ఉండగా వాటికి గతంలో ఎన్నికలను నిర్వహించలేదు. అప్పటినుంచి ప్రత్యేక అధికారుల పాలనే కొనసాగుతోంది. అయితే సర్పంచ్‌లు తమ పదవీకాలాన్ని పొడిగించాలని ప్రభుత్వానికి విన్నవించినా సర్కార్ తన నిర్ణయాన్ని వెల్లడించలేదు. దీంతో ప్రత్యేక అధికారుల పాలన అనివార్యమవుతోంది. సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో వారి వద్ద ఉన్న పంచాయతీ రికార్డులను, డిజిటల్ కీలను వాపస్ తీసుకోవాలని కార్యదర్శులకు ఉన్నతాధికారులు ఆదేశించారు.

స్థాయినిబట్టి ప్రత్యేక అధికారులు

పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల నియామకం కోసం ఇప్పటికే జిల్లా అధికార యంత్రాంగం కసరత్తుచేసి నియామకాన్ని చేపట్టింది. 589 మందికి ఆయా పంచాయతీల బాధ్యతలను అప్పగించనున్నారు. జిల్లాలో మేజర్ పంచాయతీలకు తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఎంపీడీవోలను గెజిటెడ్ అధికారులను నియమించింది. మిగిలిన వాటికి ఎంపీవోలు, వ్యవసాయ విస్తరణాధికారులు, ఎంఈవోలకు బాధ్యతలను అప్పగించనున్నారు. జిల్లాలో 171మంది గెజిటెడ్ అధికారులకు, 418 మంది నాన్‌గెజిటెడ్ ఉద్యోగులకు పంచాయతీల బాధ్యతలను అప్పగించారు.మొత్తం 23శాఖల అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమించారు. వ్యవసాయశాఖ నుంచి 144 మంది, విద్యాశాఖలో 16, విద్యుత్ 13, ఆబ్కారీ 1, అటవీశాఖ 8, హర్టీకల్చర్ 2, నీటిపారుదల శాఖ నుంచి 34, లైబ్రరీ అధికారులు 2, వైద్య ఆరోగ్యశాఖ 3, ఎన్నెస్పీ 1, పంచాయతీరాజ్ 88, ప్లానింగ్ నుంచి 3, పీఆర్ ఆర్డీ నుంచి 56, ఆర్అండ్‌బీ నుంచి 10, రెవెన్యూ 120, సెరీకల్చర్ 1, మహిళాశిశు సంక్షేమం నుంచి 69, మార్కెట్ కమిటీల నుంచి 3, సాంఘీక సంక్షేమ శాఖ నుంచి 3, ఉన్నత విద్యాశాఖ నుంచి 2, గిరిజన శాఖ 3, ఇంటర్మీడియ్ విద్య శాఖ నుంచి 4 మెత్తం 589 మందిని నియమించారు. వీరందరికీ గురువారం ఉత్తర్వులు జారీ చేయనున్నారు. ఉత్తర్వులు తీసుకున్న తక్షణమే వారు ఆయా పంచాయతీల్లో రిపోర్టు చేయాల్సి ఉంటుందని పంచాయతీ అధికారులు తెలిపారు. భద్రాద్రి జిల్లాలో మొత్తం 481 పంచాయతీలు ఉండగా వీటిలో భద్రాచలం, సారపాక ఇప్పటికే ప్రత్యేక అధికారులను నియమించి పరిపాలనను అందిస్తున్నారు. మిగతా 479 పంచాయతీలకు ప్రత్యేక అధికారులను కెటాయించనున్నట్లు డీపీవో లక్ష్మీరమాకాంత్ తెలిపారు.

సర్పంచ్‌ల నుంచి డిజిటల్‌కీ స్వాధీనం చేసుకోవాలి

- భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల



కొత్తగూడెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌ల నుంచి డిజిటల్ కీ, రికార్డులను స్వాధీనం చేసుకోవాలని భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల ఆదేశించారు. ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరం నుంచి బుధవారం ఎంపీడీవోలు, ఎంపీవోలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 1 సాయంత్రం 5గంటలకు పంచాయతీల పాలకవర్గ పదవీకాలం ముగుస్తున్నందున పంచాయతీ కార్యదర్శులు సర్పంచ్‌ల నుంచి డిజిటల్ కీ, రికార్డులు స్వాధీనం చేసుకోవాలని తెలిపారు. జిల్లాలోని 481 పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల నియామకానికి కసరత్తు జరుగుతున్నట్టు తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు తదుపరి చర్యలు చేపట్టనున్నామని, ఈ ప్రక్రియ గురువారం పూర్తవుతుందన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్‌రాజు, డీపీవో రమాకాంత్, జడ్పీ సీఈవో విద్యాలత, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు తదితరులు పాల్గొన్నారు.



నేటినుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

- ప్రయోగ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి
- ఖమ్మం జిల్లాలో 76, భద్రాద్రిలో 61కేంద్రాల్లో నిర్వహణ

ఖమ్మం ఖానాపురం హవేలీ/కొత్తగూడెం(ఆంధ్రజ్యోతి), జనవరి 31: ఇంటర్మీడియెట్ ప్రయోగ పరీక్షలు బుధవారం ప్రారంభం కానున్నాయి. నేటినుంచి 15 రోజులపాటు ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రతిరోజు ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షల కోసం ఇరు జిల్లాల్లో మొత్తం 137 కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో ఖమ్మం జిల్లాలో 76 కేంద్రాలు, భద్రాద్రి జిల్లాలో 61 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. ఇదిలా ఉండగా మొదటి సంవత్సరం విద్యార్థులకు ఈ ఏడాది నుంచి ఆంగ్లానికి ప్రాక్టికల్స్ నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 16 నుంచి ఆయా కళాశాలలో ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. పర్యవేక్షణ కోసం జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులను ఫ్లయింగ్ స్క్వాడ్‌గా నియమించారు. ఈ పరీక్షలు ముగిశాక 28నుంచి వార్షిక పరీక్షలు నిర్వహించనున్నారు. ఖమ్మం జిల్లాలో మొదటి సంవత్సరం జనరల్, వొకేషనల్ విద్యార్థులు 18,468మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 18,072 మంది మొత్తం 36,540మంది పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందుకోసం జిల్లాలో 76 పరీక్షా కేంద్రాలను గుర్తించారు. వీటిని మూడు విడతలుగా నిర్వహిస్తారు. మొదటి విడత నేటినుంచి 5 వరకు, రెండో విడత 6-10 వరకు, మూడో విడత 11-15వరకు నిర్వహించనున్నారు. ప్రయోగ పరీక్షలకు సంబంధించిన మూల్యాంకనం ఆన్‌లైన్‌లో చేపట్టనున్నారు. ప్రయోగ పరీక్షల ప్రశ్నాపత్రాలను అరగంట ముందుగా ఇంటర్ బోర్డు ఆన్‌లైన్‌లో ఉంచనుంది. తరువాత సంబంధిత కేంద్రాల ఇన్‌ఛార్జ్‌ల మొబైల్‌ఫోన్లకు వచ్చే ఓటీపీ ద్వారా ప్రశ్నాపత్రాన్ని ఎంపిక చేస్తారు. ఇందుకు తగ్గట్లుగా ఇంటర్ బోర్డు ఏర్పాట్లు చేసింది. నిరంతర పర్యవేక్షణ ప్రయోగ పరీక్షల కోసం జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా పరీక్షల కమిటీ ద్వారా నిరంతరం పర్యవేక్షణ ఉంటుంది. సీసీ కెమెరాలున్న ప్రయోగ గదుల్లో ఇంటర్ బోర్డు నిబంధనల ప్రకారం పరీక్షలు నిర్వహించనున్నారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లను సంబంధిత కళాశాల ప్రిన్సిపల్ నుంచి తీసుకొని పరీక్షలకు హాజరుకావాలని, ఎక్కడైనా హాల్ టికెట్లు ఇవ్వని పక్షంలో జిల్లా ఇంటర్మీడియెట్ అధికారులకు తెలపాలని, సంబంధిత కళాశాలలపై చర్యలు తీసుకుంటామని డీఐఈవో సూచించారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ ప్రియాంక అల తెలిపారు. ఇందుకోసం జిల్లాలో 61 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలు నిర్వహణ తీరు పర్యవేక్షణకు ముగ్గురు సభ్యులతో జిల్లా పరీక్షల కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీలో జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి సులోచనా రాణి కన్వీనర్‌గాను, మణుగూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్డీ యూసుఫ్, అశ్వాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చరిత్ర అధ్యాపకులుగా పనిచేస్తున్న సుధాకర్ రెడ్డి సభ్యులుగా ఉన్నట్లు తెలిపారు. మొదటి సంవత్సరంలో 2,433 మంది వొకేషనల్ విద్యార్థులు, రెండో సంవత్సరం వొకేషనల్ విద్యార్థులు 1,935, ద్వితీయ ఇంటర్ విద్యార్థులు 5,893మంది హాజరవుతున్నట్లు తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం అన్ని గ్రూపుల విద్యార్థులకు ఫిబ్రవరి 16న ఆంగ్లంలో ప్రాక్టికల్ పరీక్ష ఉంటుందని తెలిపారు.

గిరిజనులకు ప్రభుత్వ పథకాలు అందించాలి

అధికారులతో ఖమ్మం కలెక్టర్ గౌతమ్ సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 31: గిరిజనల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ పథకాలు అర్హులకు సక్రమంగా అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఖమ్మం కలెక్టర్ వీపీ. గౌతమ్ ఆదేశించారు. ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ, భద్రాచలం ప్రాజెక్టు అధికారి ప్రతీక్‌జైన్‌తో కలిసి సీఎం గిరివికాసం, ప్రధానమంత్రి ఆది ఆవాస్ గ్రామ యోజన, ట్రైకార్ పథకాలు, ఆర్.ఓ.ఎఫ్.ఆర్ (డీఎల్‌సీ) పరిధిలో వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ పీఎంఏఏజీవై పథకానికి మొదటిదశ రూ.2కోట్లతో మంజూరు చేసిన ఇంజనీరింగ్ మరమ్మతు పనుల పురోగతిపై వివరాలను తెలుసుకున్నారు. వీటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రెండో దశకు సంబంధించి రూ.2కోట్ల 40లక్షలతో చేపట్టనున్న ప్రతిపాదిత పనులపై కలెక్టర్ శాఖల వారీగా సమీక్షించారు. గిరిజనుల ఆర్థిక స్వావలంభన కోసం ట్రైకార్ పథకం కింద 2020-21 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి యూనిట్ల స్థిరీకరణలో పెండింగ్ యూనిట్లపై ప్రత్యేక దృష్టిసారించి వెంటనే పూర్తి చేయాలన్నారు. ఆర్.ఓ.ఎఫ్.ఆర్‌కు సంబంధించి కొణిజర్ల, సింగరేణి, రఘునాథపాలెం మండలాలకు సంబంధించి పోడు పట్టాలు పొందిన గిరిజనులు సాగునీటికి బోర్‌వెల్స్ అనుమతించాలని, మట్టిరోడ్ల నిర్మాణం కోసం సమర్పించిన దరఖాస్తులను కమిటీ పరిశీలనచేసి ఆమోదించినట్లు తెలిపారు. వన్యమృగాలను వేటాడటం నిషేధమని, అలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో ఖమ్మం జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, జిల్లా అటవీశాఖ అధికారి సిద్దార్థ విక్రమ్‌సింగ్, శిక్షణ అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఏ.పి.ఓ డెవిడ్‌రాజ్, అటవీ, నీటిపారుదల, విద్యుత్, వైద్య, వ్యవసాయ, పంచాయతీ రాజ్, రహదారులు భవనాలశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందేలా చూస్తాం

- దీర్ఘకాలిక సమస్యలపై దృష్టి పెట్టండి
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- పాలేరు నియోజకవర్గంలో విస్తృత పర్యటన


ఖమ్మం(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/ఖమ్మంకార్పొరేషన్, జనవరి 31: రాష్ట్రప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన పేదలందరికీ అందేలా చూస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మం జిల్లాలో బుధవారం పర్యటించిన ఆయన ముందుగా కూసుమంచిలోని క్యాంపు కార్యాలయలో జరిగిన కార్యక్రమంలో ప్రజలనుంచి వినతి పత్రాలు స్వీకరించారు. అనంతరం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. హోమియోపతి ఆసుపత్రికి శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన పేదలందరికీ అందేలా చూస్తామన్నారు. అనంతరం కూసుమంచి, నేలకొండపల్లి మండలాలతో పాటు పాలేరు నియోజకవర్గ పరిధిలోని ఖమ్మంకార్పొరేషన్ 1, 59, 60డివిజన్లలో కార్పొరేషన్ కమిషనర్ ఆదర్శ సురభితో కలిసి బైక్‌పై పర్యటించారు. దానవాయిగూడెం, రామన్నపేట, కైకొండాయిగూడెంలో ఆకస్మికంగా పర్యటించిన మంత్రి పొంగులేటి పారిశుధ్యంపై తనిఖీ చేశారు. వీధుల్లో తిరుగుతూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య సమస్య తలెత్తకుండా చూడాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. కార్పొరేషన్ పరిధిలోని పాలేరు నియోజకవర్గ మూడు డివిజన్ల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని డ్రెయినేజీతో పాటు పారిశుధ్య సమస్యలు చాలా కాలంగా వేధిస్తున్నాయని, సత్వరం పరిష్కరించాలని తెలిపారు. తాను సమయం కుదిరినప్పుడల్లా ఆకస్మిక పర్యటనలు చేస్తానని, ప్రజల సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా డివిజన్లలో దీర్ఘకాలికంగా పేరుకుపోయిన సమస్యలపై దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. అధికారులందరూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని, తాను ఆకస్మికంగా పర్యటించి, పరిస్థితిని సమీక్షిస్తానని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. మంత్రి పర్యటనలో ఆయన వెంట పబ్లిక్ హెల్త్ ఈఈ రంజిత్‌కుమార్, నగరపాలకసంస్థ ఈఈ కృష్ణాలాల్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ఖమ్మం కార్పొరేషన్‌లో బైక్‌పై పర్యటిస్తున్న రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



మహిళతో మాట్లాడుతూ సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



పాలేరుకు సాగర్ జలాల విడుదల

కూసుమంచి, జనవరి 31: నాగార్జునసాగర్ డ్యామ్‌నుంచి పాలేరు జలాశయానికి సాగర్ అధికారులు నీటిని విడుదల చేశారు. బుధవారం సాయంత్రం 5గంటలకు ఎడమకాల్వకు ఎన్ఎస్పీ అధికారులు గేట్లెత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం 6వేల క్యూసెక్కులనీరు విడుదల చేసినట్లు తెలిపారు. పాలేరు జలాశయంలో నీరు అడుగంటి 23 అడుగుల గరిష్ఠ నీటిమట్టానికి ప్రస్తుతం 11.5అడుగకలు పడిపోయింది. దీంతో ఖమ్మంజిల్లాతోపాటు సరిహద్దు సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలకు తాగునీటి సమస్య తలెత్తింది. దీంతో సమస్యను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకవచ్చారు. మంత్రి కేఆర్ఎంబీ అధికారులతో మాట్లాడి సాగర్ జలాల విడుదలకు ఆదేశించారు. ఈమేరకు ఎన్ఎస్పీ అధికారులు 6వేల క్యూసెక్కులనీటిని విడుదల చేశారు. శుక్రవారం తెల్లవారుజామునా పాలేరు జలాశయానికి చేరే అవకాశం ఉంది. కాగా ఖమ్మం నగరంలో తాగునీటి అవసరాల నిమిత్తం 500 క్యూసెక్కుల నీటిని పాలేరు జలాశయం నుంచి అధికారులు విడుదలచేశారు.

సమసమాజం కోసమే ‘మాస్‌లైన్’

- నూతన ప్రజాస్వామిక, సోషలిస్టు ఆశయంతోనే ప్రజాపంథా పార్టీ విలీనం
- మార్చి 3 నుంచి ఖమ్మంలో జాతీయ మహాసభలు
- ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి 31: దేశ వ్యాప్తంగా సమసమాజం ఏర్పాటు కోసం, నూతన ప్రజాస్వామిక, సోషలిస్టు ఆశయంతోనే సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా పార్టీని, దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో ఇప్పటికే విస్తరించి పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ సభ్యులు కలిగిన సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ పార్టీలో విలీనం చేసేందుకు సిద్ధమైనట్లు సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. ఈ విషయంపై రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కమిటీల ఆమోదం తీసుకొని ముందుకెళుతున్నామని పేర్కొన్నారు. మార్చి 3, 4, 5 తేదీల్లో ఖమ్మంలో నిర్వహించనున్న సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ జాతీయ మహాసభలకు ఆహ్వాన కమిటీని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో పోటు రంగారావు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా బలమైన సిద్ధాంతాలతో మతోన్మాదానికి, ఫాసిజానికి, నిరంకుశత్వానికి, అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతున్న పార్టీ మాస్‌లైన్ అని పేర్కొన్నారు. ప్రజా సమస్యలు పరిష్కారంతో పాటుగా లౌకికశక్తులను కాపాడుకునేందుకు దేశ వ్యాప్తంగా విప్లవ పార్టీలు ఒకే పార్టీగా ఏర్పాటు కావాలనే నిర్ణయం మేరకు మూడు విప్లవ పార్టీలు సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, సీపీఐ ఎంఎల్ ఆర్ఐ, పీసీసీ సీపీఐ ఎంఎల్ పార్టీలు సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్‌లో విలీనం కాబోతున్నాయన్నారు. ఇందుకే ఖమ్మం జిల్లా విప్లవ వేదికగా చరిత్రలో నిలవబోతోందన్నారు. ఈ మేరకు 14రాష్ట్రాల్లో పనిచేస్తున్న విప్లవ పార్టీలు ఒకే అవగాహనకు వచ్చి ఐక్యం కాబోతున్నాయని ఇందుకు ఖమ్మం వేదిక కానుందన్నారు. జాతీయ మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడిగా ప్రముఖ న్యాయవాది వడ్డేల్లి కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా టీపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి మనోహర్‌రాజు, కోశాధికారిగా గోకినపల్లి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, రాయల చంద్రశేఖర్‌రావు, డాక్టర్ కే.జగదీష్, పుసులూరి నరేందర్, వై. కృష్ణయ్య, పీ. రవిమారుతి, కాకి భాస్కర్, రాయల రవికుమార్, చావా రమేశ్, చావా శ్రీహరి, నయిమ్, సత్యనారాయణప్రసాద్‌లను నియామకం చేశారు.

‘అపెడా’ ఎక్కడ?

- హైదరాబాద్‌కే పరిమితమైన ప్రభుత్వరంగ సంస్థ సేవలు
- ఔత్సాహిక రైతులకు సాగు, మార్కెటింగ్‌లో శిక్షణ కరువు
- ఉమ్మడి జిల్లాలోనూ అందిస్తే పంటల ఎగుమతులకు ప్రోత్సాహం

ఖమ్మం, జనవరి 31(ఆంధ్రజ్యోతిప్రతినిధి): రాష్ట్రంలో భిన్నరకాల పంటలు ఉత్పత్తిచేసే ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ రంగ సంస్థ అయిన అగ్రికల్చర్ అండ్ ప్రాసెస్‌డ్ ఫుడ్ ప్రొడ్యూస్ ఎక్స్‌పోర్టు డెవలప్‌మెంట్ ఏజెన్సీ(అపెడా) సేవలు విస్తరణకు నోచుకోవడం లేదు. ఈ సంస్థ సేవలు హైదరాబాదుకే పరిమితమవుతున్నాయి. వాస్తవానికి ఈ ప్రభుత్వ రంగ సంస్థ జిల్లాల్లో ఔత్సాహిక యువ రైతులకు దేశ, విదేశాలకు పంటలు ఎగుమతిచేసే విధానంపై శిక్షణ కల్పించడం, వ్యవసాయ ఉత్పత్తులను ఆ దిశగా అభివృద్ధి చేయడం వంటి శిక్షణ కార్యక్రమాలు ఈ సంస్థ చేపట్టాల్సి ఉంటుంది. ప్రస్తుతం నిజామాబాద్ జిల్లాలోనే ఈ సంస్థ రైతులకు శిక్షణ అందించి పంటల ఎగుమతిని ప్రోత్సహిస్తున్నట్టు తెలిసింది. వ్యవసాయాధారిత ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఈ సంస్థ సేవలు అందిస్తే జిల్లానుంచి పలు రకాల పంటలు దేశ, విదేశాలకు రైతులే స్వయంగా ఎగుమతి చేసుకుని గిట్టుబాటు ధర పొందే అవకాశం ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో సుమారు లక్షన్నర ఎకరాల్లో మిర్చి సాగవుతోంది. రాష్ట్రంలో అత్యధికంగా మిర్చి సాగుతున్న ఈ జిల్లాలో మిర్చి నాణ్యత, ఎగుమతులకు సంబంధించి రైతులకు, రైతుసంఘాలకు శిక్షణ ఇస్తే స్థానిక మార్కెట్లకే పరిమితం కాకుండా రైతులు నేరుగా విదేశాలకు సైతం మిర్చిని ఎగుమతి చేసే అవకాశం ఉంటుంది. ఎండుమిర్చి ఆహార ఉత్పత్తులతో పాటు రంగులు, కెమికల్స్, ఔషధాల తయారీలోనూ ఉపయోగిస్తారు. మంచి ధర రావాలంటే రైతులు మిర్చిసాగులో నాణ్యత పెంచుకోవడంతో ఎగుమతులపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంది. అలాగే ఉమ్మడి జిల్లాలో సుమారు 50వేల ఎకరాలపైగా మామిడి, జీడిమామిడి పంటలు సాగవుతున్నాయి. సీజన్‌లో ఇతర రాష్ట్రాల నుంచి వ్యాపారులు జిల్లాకు వచ్చి రైతుల తోటలను కొనుగోలు చేసి మామిడిని వారే దేశ, విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. వాస్తవానికి రైతులకు ఈ తరహా శిక్షణ కల్పిస్తే రైతులు లేదా రైతుసంఘాలు, రైతు సొసైటీల ద్వారా ఎగుమతులు చేసుకుని రెట్టింపు ధరల పొందే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం యువరైతులకు ఆంగ్ల పరిజ్ఞానంతో పాటు ఇంటర్‌నెట్ వినియోగంతో జాతీ, అంతర్జాతీయ మార్కెట్లపై సమాచారం తెలుసుకునే నైపుణ్యం ఉంది. అయితే ‘అపెడా’ వంటి సంస్థలు రైతులను ఈ దిశగా అభివృద్ధి చేస్తే వారికి మరింత మేలు కలిగే అవకాశం ఉంది. అలాగే జిల్లాలో బొప్పాయి, టమాట, పచ్చిమిర్చి తదితర రకాల కూరగాయలు కూడా భారీగా సాగవుతున్నాయి. వీటితోపాటు అశ్వారావుపేట ప్రాంతంలో కోకో, వక్క, జాజి వంటి సుగంధద్రవ్యాల పంటలు కూడా సాగవుతున్నాయి. జిల్లాలో భిన్నరకాలైన ఆహార పంటలు, కూరగాయలు సాగు విస్తారంగా ఉన్నా ఈ పంటల సాగులో అధునాతన పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం, మార్కెటింగ్‌పై రైతులకు అవగాహన కలిపిస్తేనే నేరుగా రైతులు డిమాండ్ ఉన్నమార్కెట్‌లకు తమ పంటలను ఎగుమతి చేసి మంచి ధరలు పొందే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో రైతులకు శిక్షణ అందించే ‘అపెడా’ కార్యకలాపాలను జిల్లా రైతులకు అనుసంధానం చేయాల్సిన అవసరం ఉంది.

విధులకు హాజరైనా.. గైర్హాజర్‌గానే..

- వేలిముద్రలు పడక ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల దయనీయ పరిస్థితి
- వేతనాల్లో కోతలతో ఇక్కట్లు
- పనిచేసినా జీతం రాకపోవడంతో తిప్పలు

ఖమ్మంకార్పొరేషన్, జనవరి 31: వారంతా పారిశుధ్య విభాగంలో పనిచేసే ఔట్‌సోర్సింగ్ కార్మికులు. అయితే వారు విధుల్లోకి హాజరయినా, నెలలో కొన్ని రోజులు గైర్హాజర్ అవుతున్నట్లు నమోదు అవుతున్నది. పారిశుధ్య పనులను రక్షణ పరికరాలు లేకుండా చేయటంతో బయోమెట్రిక్ మిషన్లలో కొందరి వేలిముద్రలు పడటం లేదు. దీంతో వారు విధులు నిర్వహిస్తున్నా గైర్హాజర్‌గా చూపించటంలో వేతనాల్లో కోత పడుతున్నది. తక్కువ వేతనాలతో బతుకులు ఈడుస్తున్న పారిశుధ్య కార్మికులు తమ వేతనాల్లో కోత పడటంతో తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు.

వేలిముద్రలు పడకున్నా..

వాస్తవంగా బయోమెట్రిక్ యంత్రాల్లో వేలిముద్రలు పడకుంటే, మాన్యువల్‌గా రికార్డులో సదరు కార్మికులు విధులకు హాజరవుతున్నట్లు నమోదు చేయాలి. దీనిని సంబంధిత విభాగంలో అందచేస్తే కార్మికులకు పూర్తి వేతనాలు లభిస్తాయి. అయితే ఈ విషయంలో నిర్లక్ష్యం వహించటంతో పూర్తికాలం పనిచేసిన ఔట్‌సోర్సింగ్ కార్మికులు తమ వేతనాలను నష్టపోతున్నారు.



బయోమెట్రిక్‌లో ఎర్రర్ చూపిస్తున్న దృశ్యం, ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయం

సహాయ కమిషనర్ దృష్టికి వెళ్లటంతో ..

పారిశుధ్య విభాగంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జరుగుతున్న అన్యాయాన్ని ఇఫ్టూ నాయకులు జీ.రామయ్య, కే.శ్రీనివాస్ తదితరులు నగరపాలకసంస్థ సహాయ కమిషనర్ బీ. సత్యనారాయణ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఆయన దీనిపై స్పందించిన సహాయ కమిషనర్ పారిశుధ్య శానిటరీ ఇన్స్‌పెక్టర్లను, జవాన్లను తన ఛాంబర్‌కు పిలిపించి, రికార్డులను పరిశీలించారు. వాస్తవంగా విధులకు హాజరై గైర్హాజర్‌గా నమోదయిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల్లో తేడాలను సవరించాలని ఆదేశించారు. అయితే ఇప్పటికే వేతనాలకు సంబంధించిన ఫైలు తయారుకావటంతో వేతనాలను సవరించే అవకాశం లేకుండా పోయింది. దీంతో జనవరి నెలకు సంబంధించి 31రోజులు పనిచేసినా, వేతనాల్లో కోత తప్పటం లేదు. ఫిబ్రవరిలో అయినా తమకు అన్యాయం జరగకుండా చూడాలని ఔట్‌సోర్సింగ్ కార్మికులు కోరుతున్నారు.

3న ఖమ్మంలో మెగా జాబ్‌మేళా

- నిరుద్యోగ యువత జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి
- డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి


వివరాలు వెల్లడిస్తున్న డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి

ఖమ్మం స్పోర్ట్స్, జనవరి 31: రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ, టీఎస్ స్టెప్ ఆధ్వర్యంలో 3న నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించే మెగా జాబ్‌మేళాను జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎస్పీ స్టేడియంలో నిర్వహించిన విలేకరుల సమావేశం లో జాబ్‌మేళాకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. జాబ్‌మేళాలో ఫార్మా, ఐటి, మార్కెటింగ్ హెచ్‌ఆర్, కాల్‌సెంటర్, డాటా ఎంట్రీ ఆపరేటర్, రియల్‌ఎస్టేట్, రిటైల్‌మార్కెటింగ్, హౌస్‌కీపింగ్, స్టోర్‌మేనేజర్, డెలివరీబాయ్స్, వెల్డర్, ఫిట్టర్, చెఫ్, డ్రైవర్స్ రంగాలలో ఉద్యోగాలు కల్పించేందుకు సుమారు 65 కంపెనీలు పాల్గొంటున్నాయని, ఆయా కంపెనీలలో 5 వేలకు పైగా ఉద్యోగ అవకాశాలున్నట్లు ఆయన తెలిపారు. జాబ్‌మేళాలో 7వ తరగతి నుంచి 10, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ, బీటెక్, బి ఫార్మసీ, ఎం ఫార్మసీ, ఎంసీఏ, ఎంబీఏ యువతీ యువకులు పాల్గొనవచ్చని ఆయన తెలిపారు. ఎటువంటి ఫీజు లేకుండా ఉచితంగానే ఉద్యోగాలు కల్పించనున్నామని తెలిపారు. అంతేకాకుండా గత ఏడాది క్రితం జరిగిన జాబ్‌మేళాలో సైతం సుమారు 1600 మంది యువతకు పలు కంపెనీలలో ఉద్యోగాలు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గల 18 నుంచి 35 సంవత్సరాల అభ్యర్థులు పైన ఫోటోలో ఉన్న క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేసి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇతర సమాచారం కోసం హెల్ప్‌లైన్ నెంబర్లు 8886711991, 9642333668 లను సంప్రదించాలని కోరారు. మేళాలో పాల్గొనే అభ్యర్థులు ఉదయం 10 గంటల కల్లా స్టేడియానికి చేరుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో రాష్ట్ర టిఎస్ స్టెప్ మేనేజర్ మన్మోహన్, ఏడిపివో వల్లోజి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



భద్రాద్రి జిల్లా నుంచి మేడారానికి 445 బస్సులు

- జిల్లా నలుమూలల నుంచి సర్వీస్‌లు
- భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి
- ఉమ్మడి జిల్లా ఆర్‌ఎం వెంకన్న

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్/పాల్వంచటౌన్, జనవరి 31: భద్రాద్రి జిల్లా నుంచి మేడారం సమ్మక్క - సారక్క జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీస్‌లను నడిపిస్తుందని ఖమ్మం జిల్లా రీజనల్ మేనేజర్ సీహెచ్.వెంకన్న తెలిపారు. బుధవారం భద్రాద్రి జిల్లా పర్యటనలో భాగంగా కొత్తగూడెం బస్టాండ్‌లో పరిశీలించారు. ఆర్‌ఎం మాట్లాడుతూ భద్రాద్రి జిల్లాలో కొత్తగూడెం, టేకులపల్లి ప్రాంతాల నుంచి 155 బస్సులు కొత్తగూడెం డిపో పర్యవేక్షణలో నడిపిస్తున్నామన్నారు. అదేవిధంగా ఇల్లెందు డిపో నుంచి 135 బస్సు సర్వీస్‌లు ఖమ్మం డిపో నుంచి నడిపిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే పాల్వంచ బస్టాండ్ నుంచి 50 బస్సులను మధిర డిపో నుంచి నడిపిస్తున్నామని భద్రాచలం డిపో నుంచి 40 మణుగూరు డిపో నుంచి 25 నడిపిస్తున్నట్లు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతమైన ఏటూరి నాగారం, చర్ల, వెంకటాపురం ప్రాంతాల నుంచి 40 బస్సులు సత్తుపల్లి డిపో నుంచి నడిపిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కొత్తగూడెం ఆర్టీసీ ఓల్డ్ డిపో వద్ద గల స్థలాలను ప్రత్యేకంగా వెళ్ళి పరిశీలించారు. ఆ ప్రాంతం గుండా మేడారం సర్వీస్‌లు ఏర్పాటు చేసేలా అధికారులతో మాట్లాడి సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎం పవిత్ర, కొత్తగూడెం డీఎం భాణాల వెంకటేశ్వరరావు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం పాల్వంచ్ బస్టాండ్ సందర్శించేందుకు బయలుదేరి వెళ్ళారు.


అధికారులకు సూచనలిస్తున్న ఆర్‌ఎం వెంకన్న

బుధవారం జిల్లా పర్యటనలో భాగంగా పాల్వంచ బస్టాండ్‌ను సందర్శించారు. బస్టాండ్ పరిసరాలను పరిశీలించారు. పలు సమస్యలను గుర్తించిన ఆయన వాటి పరిష్కారానికి సంబందిత అధికారులకు పలు సూచనలు చేశారు

ఖమ్మంజిల్లా ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వోగా రామునాయక్

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 31: జిల్లా ఇన్‌చార్జ్ వైద్యాధికారిగా డాక్టర్ రామునాయక్‌ను నియమిస్తూ రాష్ట్ర కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్ డాక్టర్ రవీందర్‌నాయక్ ఉత్తర్వులు విడుదల చేశారు. ఇప్పటి వరకు పనిచేసిన డాక్టర్ బి మాలతి 15 రోజుల పాటు వ్యక్తిగత కారణాలతో సెలవుపై వెళ్లారు. ఈ నేపథ్యంలో డాక్టర్ రామునాయక్‌ను ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వోగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. దీంతో డాక్టర్ రామునాయక్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు కలెక్టర్ గౌతమ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రామునాయక్‌ను కలెక్టర్ అభినందించారు. అనంతరం కార్యాలయం అధికారులు, సిబ్బంది డాక్టర్ రామునాయక్‌ను కలిసి అభినందించారు. ఆ తర్వాత ఆయన కూసుమంచిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనికీ చేశారు. ఆ తర్వాత రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తో పాటు వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.


డాక్టర్ రామునాయక్

అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య

నేలకొండపల్లి జనవరి 31: నేలకొండపల్లి మండలం ముటాపురం గ్రామానికి చెందిన భూక్యా మంగ్యా(32) అనే కౌలురైతు అప్పులబాధతో నాలుగురోజుల క్రితం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతనిని కుటుంబ సభ్యులు .ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు. కుటంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మంగ్యా ఎకరంన్నర మిర్చి, రెండు ఎకరాల చెరుకు, మూడు ఎకరాల మొక్కజొన్న పంటలను కౌలుకు తీసుకుని సుమారు రూ.6లక్షల వరకు పెట్టుబడి పెట్టి సాగుచేశాడు. పెట్టుబడి మొత్తాన్ని అప్పుగా తెచ్చాడని, మిర్చీ, మొక్కజొన్న పంటలు దెబ్బతినటంతో అప్పులు తీర్చలేనేమోనన్న భయంతో పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

దయాకర్‌రెడ్డి పరామర్శ

మంగ్యా మృతి సమాచారం తెలుసుకున్న రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయం ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి బుధవారం ముటాపురం గ్రామంలోని మృతిని ఇంటివద్ద మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటంబానికి అండగా ఉంటామని హామీఇచ్చారు.

వేదింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

కామేపల్లి: అత్తింటి వేదింపులు తట్టుకోలేక ఓ వివాహిత పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కామేపల్లి మండలం ఊట్కూర్ గ్రామంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఊట్కూర్ గ్రామానికి చెందిన గుడిమెట్ల గోపి, అదే గ్రామానికి చెందిన మౌనిక(21) మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. భార్య భర్తల మధ్య అప్పుడప్పుడు మనస్పర్థలు రావడం, కుటుంబంతో గొడవలు కావడంతో పెద్దల సమక్షంలో వాటిని పరిష్కరించడం జరుగుతున్నాయి. గత నెల 12న మౌనిక ఇంట్లో ఉన్న పురుగులమందు తాగింది. వెంటనే కుటుంబ సభ్యులు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడ నుంచి ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తల్లి స్థానిక కామేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.


మౌనిక(ఫైల్)

తుపాకీతో కాల్చుకుని జవాన్ బలవన్మరణం

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా డొర్నపాల్‌లోని సీఆర్‌పీఎఫ్ 150 బెటాలియన్ చెందిన ఓ కానిస్టేబుల్ బుధవారం ఉదయం తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడు గత కొంత కాలంగా అనారోగ్య సమస్యతో తను బాధ పడుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆత్మహత్యకు పాల్పడ్డట్లు బలగాలు చెబుతున్నాయి. మృతుడిది బీహార్‌గా తెలుస్తోంది.

విద్యతో ఉన్నత శిఖరాలు సాధిస్తారు

● ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ వర్లు

కల్లూరు, జనవరి 31: విద్య ద్వారా ప్రతి ఒక్కరు ఉన్నత శిఖరాలను సాధించ వచ్చునని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ వర్లు పేర్కొన్నారు. కల్లూరులోని సెంచరీ పాఠ శాలలో బుధవారం జరిగిన వార్షికోత్సవ సమావేశానికి ముఖ్యఅతిధిగా విచ్చేసి విద్యార్థుల ను నుద్దేశించి ప్రసంగించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను వేధించకుండ పోత్సహిస్తే నైపుణ్యాలు అందిపుచ్చుకుంటారని చెప్పారు. ప్రతి విద్యార్థిలో ఏదో ఒక నైపుణ్యం దాగి ఉందని దానిని వెలికి తీయటమే ప్రతి ఉపాధ్యాయుడి బాధ్యత అని తెలిపారు. ప్రతీ విద్యార్థిలో ఉండే నైపుణ్యాలను ప్రోత్సహించి ఈ పోటీ ప్రపంచంతో నెగ్గుకు వచ్చేలా చూడాలని హితువు చెప్పారు. ప్రతి విద్యార్థి కష్టపడితే అద్భుతమైన ఫలితాలు సాధించ వచ్చునన్నారు. సమావేశంలో సెంచరి విద్యా సంస్థల ఛైర్మన్ డీవీఎస్ ప్రభాకర్, ఎంఈవో దామోదరప్రసాద్ కూడా ప్రసంగించారు. విద్యార్థులచే నిర్వహించి సాంస్కృతిక, దేశభక్తి గేయాల కార్యాక్రమాలు పలువురిని అలరింప చేశాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎండి బర్కతుల్లా, డైరెక్టర్ ఏగుపాటి కృష్ణారావు, డైరెక్టర్ ఏగుపాటి సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న డాక్టర్ వర్లు

కూలీలను తరలిస్తున్న ఆటో బోల్తా

- ఎనిమిది మందికి గాయాలు

కరకగూడెం, జనవరి 31: మండలంలోని అనంతారం పరిధిలోని ప్రధాన రహదారిపై నాటు వేసేందుకు వెళ్తున్న కూలీలను తరలిస్తున్న ఆటో బోల్తా పడటంతో ఎనిమిది మంది కూలీలకు తీవ్ర గాయాలు అయిన సంఘటన కరకగూడెం మండలంలో బుధవారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. తుమ్మలగూడెం, అనంతారం గ్రామానికి చెందిన కూలీలు పద్మాపురం గ్రామంలో నాటు వేసేందుకు ఆటోలో వెళ్తుండగా అనంతారం గ్రామ చీవారులోని మూలమలుపు వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో అనంతారం గ్రామానికి చెందిన నిట్ట శివలక్ష్మి, నిట్ట ముత్తయ్య, బోడ సూర్య కాంతం, శెట్టిపల్లి జయమ్మ, డేగల స్వర్ణలత, తుమ్మలగూడెం గ్రామానికి అంబోజు నర్సయ్య, బోడ దనమ్మ, సాయిరి కిరణ్‌లకు తీవ్ర గాయాలు అయ్యాయి. గ్రామస్థులు క్షతగాత్రులను కరకగూడెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్యాధికారి మధు ప్రథమ చికిత్స అనంతరం 108లో మణుగూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆటో బోల్తా పడిన సమయంలో ఎటువంటి వాహనాలు రాక పోవడంతో ప్రమాదం తప్పిందని గ్రామస్థులు తెలిపారు.

3న దిశ కమిటీ సమావేశం: కలెక్టర్ గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 31: కేంద్రప్రభుత్వ పథకాల పనితీరు, జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ దిశ సమావేశాన్ని 3న కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిం చే ఈ సమావేశానికి ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వర రావు చైర్మన్‌గా దిశకమిటీ నిర్ణయించినట్లు తెలిపారు. సభ్యులు, సంబందిత శాఖల అధికారు లు ఈ సమావే శానికి హాజరుకావాలని కలెక్టర్ గౌతమ్ ఓ ప్రకటనలో తెలిపారు.

కిరాణా వ్యాపారి దివాల పిటీషన్ దాఖలు

ఖమ్మం లీగల్, జనవరి 31: ఖమ్మం పట్టణం, గాంధీచౌక్ ప్రాంతానికి చెందిన కురివెళ్ళ నాగేశ్వరరావు మొత్తం 45 మందిని ప్రతివాదులుగా చూపిస్తూ మొత్తం రూ.కోటి 82లక్షల 58వేలకు దివాళా పిటిషన్ దాఖలు చేశాడు. దివాళా దారుడు కిరాణా వ్యాపారం చేసేవాడు. ఈ వ్యాపారాన్ని అభివృద్ధి చేయటంకోసం బంధువులు, స్నేహితుల దగ్గర అధిక వడ్డీలకు అప్పులు తీసుకొని ఈ వ్యాపారాన్ని అభివృద్ధి చేసినాడు. ఈ వ్యాపారం సరిగా నడవకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితిలో మొత్తం 45 మందిని ప్రతివాదులుగా చూపిస్తూ ఖమ్మం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో తన న్యాయవాది యడ్లపల్లి రమేష్ ద్వారా దివాల పిటీషన్ దాఖలు చేశాడు.

సామాజిక తనిఖీలో బయటపడిన అక్రమాలు

ఏన్కూరు, జనవరి 31: ఈజీఎస్ సామాజిక తనిఖీలో అక్రమాలు బయటపడుతున్నాయి. బుధవారం మండలప్రజాపరిషత్ కార్యాలయంలో ఈజీఎస్ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు 1-4-2022 నుంచి 31-3-2023వరకు మం డలంలో రూ.3.90కోట్ల పనులు జరిగాయి. ఈపనుల్లో కూలీల సంతకాలు లేకుండానే పేమెంట్ చేశారని, ఎస్టిమేషన్ ప్రకారం పనిచేయించడంలేదని, వర్కుఫైల్‌ను టీఏలు నిర్వహించలేదని కొన్ని పంచాయతీల్లో రికార్డులు కూడాల లేవని, జాబ్‌కార్డు రెన్యువల్ చేయడంలేదని ఆడిట్‌లో తేలింది. పూర్తిస్థాయి ఆడిట్ అనంతరం మరిన్ని అక్రమాలు తెలిసేఅవకాశం ఉంది. ముందుగా ఓపన్‌ఫోరాన్ని ట్రైనీ కలెక్టర్ మయాంక్‌సింగ్ ప్రారంభించారు. ఈతనిఖీల్లో అడిషనల్ డీఆర్‌డీవో విరీష, జడ్పీటీసీ బాదవత్ బుజ్జి ,ఎంపీపీ ఆరెం వరలక్ష్మి, ఎంపీడీవో వేణుమాదవ్, సోషల్ ఆడిట్, క్వాలిటీ కంట్రోల్, విజిలెన్సు విభాగం అధికారులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఏన్కూరు విద్యార్థి

ఏన్కూరు, జనవరి 31: జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఏన్కూరు మండలం కాలనీ నాచారం గ్రామానిక చెందిన యాసా యశ్వంత్‌కుమార్ అనే విద్యార్థి ఎంపికయ్యాడు. జనవరి 11నుంచి 14వరకు గజ్వేల్‌లో జరిగిన పోటీల్లో ఖమ్మంజిల్లా కబడ్డీ అసోసియేషన్ టీంలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. 49వ జాతీయస్థాయి జూనియర పోటీలు ఈనెల 1నుంచి4వరకు హైదరాబాదు బాచుపల్లిలో జరిగే పోటీల్లో యశ్వంత్‌కుమార్ పాల్గొననున్నాడు. యశ్వంత్‌కుమార్‌ను డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి, డీఈవో సోమశేఖరశర్మ, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు క్రిస్టఫర్‌బాబు, పీఈటీలు శోభన్, లక్ష్మణ్ అభినందించారు.

నేరప్రవృత్తి వీడితే రౌడీషీట్ తొలగిస్తాం

- శాంతిభద్రతలకు విఘాతం కలిగితే కఠిన చర్యలు: ఖమ్మం సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం, జనవరి 31: శాంతిభద్రతలకు విఘాతం కలిగిచేలా హద్దుమీరితే ప్రవర్తిస్తే కఠినంగా వ్యవహరిస్తామని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ హెచ్చరించారు. ఖమ్మట టుటౌన్ పరిధిలో రౌడీషీటర్లలో మార్పుకోసం టుటౌన్ పోలీసుస్టేషన్‌లో సీపీ బుధవారం సాయంత్రం కౌన్సెలింగ్ నిర్వహించి ఒకొక్కరినుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ నేరప్రవృత్తి మార్చుకోవడానికి ఒక అవకాశం ఇస్తున్నామని, ఒకవేళ మారకపోతే కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందన్నారు. యధావిధిగా నేరాలకు పాల్పడితే వారిపై పీడీయాక్టు కింద కేసులు నమోదుచేస్తామన్నారు. ప్రభుత్వ ప్రైవేటు భూములకు కబ్జాలకు పాల్పడే రౌడీషటీర్లు, రియల్టర్లపై పోలీసులు దృష్టిసారించారని, జిల్లాలో జరిగే నేరాల్లో ఎక్కువగా రౌడీషీటర్లే నిందితులుగా ఉన్నారని పేర్కొన్నారు. సివిల్ వివాదాల్లో జోక్యం చేసుకుని దాడులకు దిగుతూ పోలీసుల రికార్డుల్లో ఎక్కుతున్న నేపథ్యంలో వారిపై ప్రత్యేక నిఘాపెట్టి కట్టడి చేయడంలో భాగంగా ఈకౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలో ఎక్కడైనా రౌడీషీటర్లు, నేరస్తులు ఇబ్బంది పెడుతుంటే ప్రజలు తమ దృష్టికి తేవాలని ఆయన కోరారు. అదేవిధంగా పబ్లిక్‌గా న్యూసెన్స్ చేసే అకతాయిల పట్ల కఠినంగా ఉండాలని పోలీసు అధికారులకుసూచించారు.


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీపీ సునీల్‌దత్

ఉన్నత విద్యాసంస్థల్లో డీ రిజర్వేషన్ పద్ధతి ఉపసంహరించుకోవాలి

● రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్దంగా నిర్ణయాలు: పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ఆజాద్

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి 31: ఉన్నత విద్యాసంస్థల్లో బడుగు, బలహీనవర్గాల విద్యార్థులను దూరం చేసేందుకు రాజ్యాంగ స్ఫూర్తికి విరూద్దంగా డి రిజర్వేషన్ పద్దతిని అమలు చేస్తున్నారని తక్షణమే డి రిజర్వేషన్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ డిమాండ్ చేశారు. బుధవారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన జాతీయ విద్యావిధానంలో బాగంగా యూజీసీ ఇటువంటి నిర్ణయం తీసుకుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థులకు కేటాయించిన ఖాళీలను భర్తీ చేయకుండా డీ రిజర్వేషన్ చేయటం దుర్మార్గంపై విమర్శించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షకార్యదర్శులు లక్ష్మణ్, వంగూరి వెంకటేష్, కరుణ్, శ్రీకాంత్, లాల్‌పాషా, శ్రీను, సందీప్, వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ డ్రైవర్ల సంఘం అత్యవసర సమావేశం

ఖమ్మంకలెక్టరేట్, జనవరి 31: ప్రభుత్వ డ్రైవర్ల సంఘం అత్యవసర సమావేశం జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. రాష్ట్రస్థాయి నాయకులు ఈ సమావేశంలో పాల్గొని జిల్లాలో ఖాళీగా ఉన్న పదవులను భర్తీ చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ మన్జిత్ సింగ్ ఆధ్వర్యంలో ఖాళీగా ఉన్న పదవులను భర్తీ చేశారు. జిల్లా ముఖ్య సలహాదారులుగా ఎస్కే నయీమ్, జి, రాములు, ఉపాధ్యక్షులుగా యండి. రఫీ, అఫ్జల్ పాషా, రెండో సలహాదారుడిగా ఎం. బాబురావులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎండి .అబ్దుల్ హకీమ్ , జిల్లా ప్రధాన కార్యదర్శి టి.పంతులు, నాయకులు వేస్కు. ఖాజామియా, ఎం. రమేష్, డీఆర్‌డీఏ శ్రీనివాస్, యాకూబ్, జానీ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో చెరుకుకూలీ మృతి

నేలకొండపల్లి జనవరి 31: మధుకాన్ షుగర్ ఫ్యాక్టరి పరిధిలోని అమ్మగూడెం గ్రామానికి చెందిన ఓ రైతుకు చెరుకు నరకటానికి వచ్చిన ముటాలోని ఒక కూలీ సత్తిబాబు(53) విద్యుత్ ఘాతంతో మృతిచెందాడు. కాకినాడ జిల్లా తుని మండలం శృంగవరానికి చెందిన ముటా అమ్మగూడెంలోని రైతుకు చెరుకు నరకటానికి రాగా కూలీలకు వంట చేయటానికి అందలో ఓ కూలీని ఏర్పాటు చేసుకున్నారు. బుధవారం సాయంత్రం దుస్తులు ఆరేస్తుండగా దండేనికి విద్యుత్ సరఫరా జరిగి సత్తిబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

లారీ చోరీ కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు

ఖమ్మంక్రైం, జనవరి31: లారీ చోరీ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్టు టౌన్ ఏసీపీ హరికృష్ణ తెలిపారు. నగరంలోని త్రీటౌన్ పోలీసుస్టేషన్‌లో బుధవారం మధ్యాహ్నం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలోని పంపింగ్‌వెల్‌రోడ్డుకు చెందిన తమ్మిశెట్టి చిరంజీవి, రామన్నపేటకు చెందిన కొత్త ఇలీషా అనేవారు ఈనెల 20వతేదీన నగరంలోని నెహ్రూ విగ్రహం సమీపంలో ఓ వ్యక్తి లారీ ఆపి ఉండగా, దానిని చోరీ చేశారు. దీంతో నిందితుల వివరాలు కనుగోని సీసీఎస్, త్రీటౌన్ పోలీసుల ఆధ్వర్యంలో వారిని గుర్తించి వారి వద్దనుండి ఒక లారీ రూ.2లక్షల నగదు స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో సీసీఎస్ ఏసీపీ రవి, సీఐ బాలాజీ, త్రీటౌన్‌సీఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కేశవాపురంలో చైన్‌స్నాచింగ్

కూసుమంచి, జనవరి 31: మండలంలోని కేశవాపురం గ్రామంలో మహిళ మెడలో బంగారు గొలుసును బైక్‌పై వచ్చిన ఓ ఆగంతకుడు లాక్కొని పరారయ్యాడు. బాధితురాలి కథనం ప్రకారం గ్రామానికి చెందిన తాళ్లూరి రంగమ్మ అనే వృద్ధురాలు బంధువుల ఇంట్లో నుంచి సొరకాయ తీసుకుని ఇంటికి వెళుతోంది. ప్రధానరహదారి నుంచి గల్లీలోకి మళ్లింది. ఈక్రమంలో గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి చైన్ లాక్కొని వెళ్లిపోయాడు. ముఖానికి కర్చీఫ్ కట్టుకుని ఉన్నాడని, ఖమ్మం వైపునుంచి వచ్చి ఖమ్మంవైపు పరారయ్యాడని బాధితురాలు తెలిపింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కూసుమంచి సీఐ జితేందర్‌రెడ్డి, ఎస్ఐ రమేష్‌కుమార్ వెంటనే సంఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. ఆగంతుకుడికోసం గాలింపుచర్యలు చేపట్టారు. సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నారు. సుమారు 20గ్రాములు విలువ ఉంటుందని బాధితులు తెలిపారు. ఈమేరకు కేసునమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పినపాక, జనవరి 31: మండలంలోని భూపతిరావుపేట గ్రామానికి చెందిన కర్నె నవీన్(26) అనే యువకుడు మంగళవారం పురుగులమందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, మణుగూరులోని 100 పడకల ఆసుపత్రిలో వైద్య సేవలు అందించారు. అక్కడి నుంచి భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మణుగూరు, జనవరి 31: మండలంలోని రైల్వేస్టేషన్ సమీపంలోని పద్మగూడెం గ్రామ సరిహద్దులోని కొత్త చెరువులో బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ విషయమై ఎస్ఐ శ్రీనివాస్‌ను వివరాలు అడగ్గా 15 రోజుల క్రితమే మృతి చెంది ఉంటాడని, వివరాలు తెలియారాలేదన్నారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు.

ఆర్టీసీ బస్సులో గంజాయి పట్టివేత

- జూలూరుపాడు, బూర్గంపాడు, నేలకొండపల్లి వద్ద తనిఖీల్లో 51 కిలోల గంజాయి పట్టుకున్న పోలీసు, ఎక్సైజ్ అధికారులు

జూలూరుపాడు, జనవరి 31: ఆర్టీసీ బస్సులో గంజాయి రవాణా చేస్తుండగా పోలీసులకు పట్టుబడిన సంఘటన బుధవారం జూలూరుపాడులో చోటు చేసుకుంది. బుధవారం పోలీస్‌స్టేషన్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా భద్రాచలం డిపోకు చెందిన ఆర్టీసీ (రాజధాని) టిఎస్ 28 జెడ్ 0011 నెంబరు గల బస్సు భద్రాచలం నుంచి హైదరాబాద్ వెళ్తుంది. ఆ సమయంలో 8 మంది ప్రయాణికులు బస్సులో ఉన్నారు. పోలీసులు బస్సును ఆపి తనిఖీ చేశారు. బస్సు డిక్కీలో రెండు బ్యాగులు కన్పించడంతో వాటిని తనిఖీ చేశారు. వాటిలో సుమారు 20 కేజీల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. దానిని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ బి.రమణారావు, కొత్తగూడెం ఏరియాకు చెందిన బస్సు క్లీనర్ కార్తెకెయాల నుంచి వివరాలను సేకరించారు. అదేవిధంగా బస్సులో ప్రయాణిస్తున్న చర్లకు చెందిన కట్టం కనకయ్య, రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్‌పేటకు చెందిన మేకల యాదగిరి ఇద్దరు అనుమానిత వ్యక్తులను అదుపులోకి తీసుకొని సీఐ శ్రీనివాస్ విచారణ చేశారు. దీంతో సారపాకలో ఇద్దరు వ్యక్తులు డిక్కీలో రెండు బ్యాగులను పెట్టి బస్సు ఎక్కారని తెలిపారు. పాల్వంచ బస్‌స్టేషన్‌లో ఆ ఇద్దరు వ్యక్తులు బస్సులోనే బ్యాగులను ఉంచి కిందకు వెళ్ళారని క్లీనర్ తనకు చెప్పినట్లు డ్రైవర్ తెలిపారు. బస్సును 15 నిమిషాల పాటు ఆపినప్పటికి వారు రాకపోవడంతో ఆ రెండు బ్యాగులను జూలూరుపాడు పోలీస్ స్టేషన్‌లో అప్పగించవచ్చు అనే ఉద్దేశ్యంతో వచ్చేసినట్లు డ్రైవర్ సీఐకు వివరించారు. ఆ ఇద్దరు వ్యక్తులు ఎక్కడకు వెళ్ళేందుకు టికెట్టు తీసుకున్నారని సీఐ వారిని ప్రశ్నించా రు. అదేవిధంగా అదుపులోకి తీసుకున్న ఇద్దరు అనుమానితుల వ్యక్తుల ప్రమేయం ఏమైనా ఉన్నదా అని పోలీసులు విచారణ జరిపారు. సదరు ఇద్దరు వ్యక్తుల ప్రమేయం లేదని నిర్ధారణకు వచ్చి వారిని వదిలిపెట్టారు. బస్సు డ్రైవర్, క్లీనర్ చెప్పిన సమాచారం మేరకు నింధితులను గుర్తించేందుకు పోలీసులు వివిధ కోణాలలో విచారణ సాగిస్తున్నారు. గంజాయి తరలింపులో బస్సు క్లీనర్ కార్తికేయ ప్రమేయం ఉన్నదా అన్న కోణంలో కూడా విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. బస్సు క్లీనర్ కొత్తగూడెం సీసీఎస్ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.


నింధితుడి వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

25 కేజీల గంజాయి స్వాధీనం

బూర్గంపాడు, జనవరి 31: అక్రమంగా తరలిస్తోన్న 25 కేజీల గంజాయిని బూర్గంపాడు పోలీసులు బుదవారం పట్టుకుని స్వాదీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని మణగూరు క్రాస్‌రోడ్డు ఎస్ఐ రాజ్‌కుమార్ వాహనాలు తనిఖీ చేస్తున్న విషయాన్ని చూసిన ఓ కారు తప్పించుకుని పారిపోయేందుకు యత్నించింది. ఈ క్రమంలో కారును వెంబడించి పట్టుకుని తనిఖీ చేయగా కారులో గంజాయి దొరికింది. దీంతో గంజాయితోపాటు కారును స్వాదీనం చేసుకుని దీనికి సంబంధించిన 3 వ్యక్తులను ఆదుపులోకి తీసు కున్నారు. గంజాయిని ఎక్కడ కొనుగోలు చేసారు. ఎక్కడికి తరలించనున్నారు అనే విషయమై విచారణ చేయనునట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

ఆరు కిలోల గంజాయి స్వాధీనం

నేలకొండపల్లి: బుధవారం మధ్యాహ్నం నేలకొండపల్లి ఎక్సైజ్ పోలీసులు నేలకొండపల్లి సమీపంలోని చెర్వుమాధారం క్రాస్ రోడ్డు వద్ద 6.610 కేజీల గంజాయిని స్వాదీనం చేసుకుని ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. వివరాల ప్రకారం నేలకొండపల్లి ఎక్సైజ్ సీఐ పోశెట్టి తన సిబ్బందితో చెర్వుమాధారం నుంచి నేలకొండపల్లి వస్తుండగా చెర్వుమాధారం క్రాస్ రోడ్డు వద్ద ఓవ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. అతన్ని ప్రశ్నించి అతని వద్ద ఉన్న బ్యాగును పరిశీలించగా బ్యాగులో 6.610 కేజీల బరువున్న ఆరు గంజాయి ప్యాకెట్లు గుర్తించి, స్వాదీనం చేసుకుని. సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుని పేరు జయదేబ్ సర్కారని, వెస్టుబెంగాల్ రాష్ట్రానికి చెందిన వాడిగా గుర్తించారు. అతనిపై కేసును నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. సీఐ పోశెట్టితో పాటు ఎస్ఐలు రాధాకృష్ణ, శంకర్, హెడ్ కానిస్టేబుల్ పి.శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

మైనింగ్ అధికారి
పదవీ విరమణ

- సన్మానించిన 'ఆంధ్రజ్యోతి'
బ్రాంచ్ మేనేజర్ తాళ్లూరి పుల్లారావు



వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న దృశ్యం

కారేపల్లి, జనవరి31: మండల పరిధిలోని మాధారం డోలమైంట్‌లో మైన్స్‌లో సర్వేయర్‌గా పనిచేసిన బండి వెంకటేశ్వరరావు పదవీ విరమణ కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. కారేపల్లి మైనింగ్ హాల్లో నిర్వహించిన ప్రత్యేక సన్మాన కార్యక్రమంలో ఖమ్మం ఆంధ్రజ్యోతి యూనిట్ బ్రాంచ్ మేనేజర్ తాళ్లూరి పుల్లారావు, ఖమ్మం మునిసిపల్ కార్పొరేటర్ చావా నారాయణ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈసందర్భంగా పుల్లారావు, చావా నారాయణ మాట్లాడుతూ పదవిలో ఉన్న సమయంలో చేసినసేవలను ప్రతీ ఒక్కరు గుర్తుంచుకుంటారని అన్నారు. ఈకార్యక్రమంలో మైన్స్ జీఎం డి.శివకుమార్, చావా నాగేశ్వరరావు, ఎ. శ్రీనివాస్‌రావు పలు సంఘాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

రామాలయ నిత్యాన్నదానానికి
రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న దృశ్యం

భద్రాచలం, జనవరి 31: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి బుధవారం హైదరాబాద్‌లోని మియాపూర్‌కు చెందిన మల్లాది వెంకటసుబ్రహ్మణ్య విజయకృష్ణ రూ.లక్ష విరాళాన్ని అందించారు. అంతకు ముందు వారు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సదా ప్రజాసేవలో..

- కీలకంగా మారిన మంత్రుల క్యాంపు కార్యాలయాలు
- వినతుల పరిష్కారానికి ప్రత్యేకంగా సిబ్బంది
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయాల్లో ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తున్న సిబ్బంది

ఖమ్మం సంక్షేమవిభాగం, జనవరి 31: గతంలో ఎమ్మెల్యేలు, మంత్రులు, ప్రజాప్రతినిధుల విశ్రాంతికి ఉపయోగపడిన క్యాంపు కార్యాలయాలు, ఇప్పుడు ప్రజల సమస్యలు పరిష్కారానికి ఉపయోగపడుతున్నాయి. మంత్రులకు సమస్యలు చెప్పుకోవాలంటే హైదరాబాద్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఇప్పుడు లేదని ప్రజలు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వారి సొంత నియోజకవర్గాలతో పాటుగా ఖమ్మం జిల్లా కేంద్రంలో క్యాంపు కార్యాలయాలు నిర్వహిస్తున్నారు.

ప్రత్యేకంగా ఉద్యోగులు

ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎలా దరఖాస్తులు అవగాహన ఉన్న ఉద్యోగులను క్యాంపు కార్యాలయాల్లో ప్రత్యేకంగా నియమించారు. మంత్రులు గ్రామాలు పర్యటన ల్లో వచ్చిన వినతులను క్యాంపు కార్యాలయాలకు తీసుకొచ్చి వాటి పరిష్కారానికి క్యాంపు కార్యాలయాల్లో కంప్యూటరీ కరణ చేసి సమస్యలు పరిష్కారం జరిగేలా చేస్తున్నారు. రోజు వారీగా మంత్రులు క్యాంపు కార్యాలయాలకు పలు సమస్యలు చెప్పుకునేందుకు వచ్చిన ప్రజల నుంచి వివరాలు తీసుకోని వాటిని తిరిగి మంత్రులకు పంపించి ఆయా సమస్యలు పరిష్కారం జరిగేలా చూస్తున్నారు.

అన్ని రకాల వినతులు

ముఖ్యమంత్రి సహాయ నిధి, వైద్య ఖర్చుల కోసం ఎల్‌వోసీ లేఖలు, ఆసరా పింఛన్లు, గృహనిర్మాణం, పోలీస్ స్టేషన్‌లో బాధితులకు న్యాయం, ఉద్యోగ, ఉపాధి కల్పన, భూ సమస్యలు, కల్యాణిలక్ష్మి, షాదీముబారక్ కోసం ప్రజలు వినతులు ఇస్తున్నారు. వినతలు చేస్తున్నారు. నాయకులు మాత్రం గ్రామాల్లోని తాగునీటి సమస్యలు, రహదారుల నిర్మాణం, డ్రైనేజీలు, విద్యుత్, బస్ సర్వీసులు ఏర్పాటు కోసం క్యాంపు కార్యాలయాలకు వచ్చి ఆయా సమస్యలను క్యాంపు కార్యాలయాల నుంచి మంత్రుల దృష్టికి తీసుకెళుతున్నారు. వచ్చే దరఖాస్తులను పరిశీలన చేసి వాటికి కావాల్సిన దస్త్రాలను పూరించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి, ఆర్థిక సహాయం అందేలా క్యాంపు కార్యాలయాల్లోని ఉద్యోగులు కీలకంగా వ్యవహరిస్తున్నారు.

ఆధ్యాత్మిక భద్రాద్రికి సహకరించండి

- ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు ప్రత్యేక కసరత్తు
- ర్యాష్ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు
- బెల్టుషాపులను ఎత్తివేయాలి
- గోవుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు
- వివిధ శాఖల అధికారులతో ఏఎస్పీ పరితోష్ పంకజ్



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ పరితోష్ పంకజ్

భద్రాచలం, జనవరి 31: ఆధ్యాత్మిక భద్రాద్రిలో సమస్యల పరిష్కారానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని ఏఎస్పీ పరితోష్ పంకజ్ కోరారు. భద్రాచలంలోని ఏఎస్పీ కార్యాలయంలో బుధవారం రెవిన్యూ, పోలీసు, రవాణ శాఖ, గ్రామ పంచాయతీ, ఎక్సైజ్, భద్రాద్రి దేవస్థానం, మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భద్రాచలం పుణ్యక్షేత్రంకు తరలివచ్చే భక్తులకు ఎటువంటి ట్రాఫిక్ రద్దీ సమస్యలు తలెత్తకుండా మార్గాన్ని సుగమం చేయాల్సిన బాధ్యత అన్ని శాఖలపై ఉందని ఏఎస్పీ పేర్కొన్నారు. ఇందుకు సంబంధిత శాఖల అధికారులు ప్రాథమిక కసరత్తు నిర్వహించి భక్తులకు పార్కింగ్ స్థలం చూపెట్టడంతో పాటు పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. కార్లు, ఇతరత్రా వాహనాల పార్కింగ్ కోసం అవసరమైతే ప్రైవేటు స్థలాలను లీజుకు తీసుకొని పార్కు చేసే విధంగా చొరవ చూపాలన్నారు. ఆలయం చుట్టూ వాహనాల పార్కింగ్ ఇష్టానుసారంగా ఉండకుండా చూడాలని పోలీసు శాఖ అధికారులను ఆదేశించారు. భద్రాద్రికి వచ్చే భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందని నిర్ణయించారు. పట్టణంలోని ప్రైవేటు వసతి గృహాల ధరల నియంత్రణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ఇందుకు అసోసియేషన్ సభ్యులను సంప్రదించాలని నిర్ణయించారు. రామాలయం చుట్టూ వంద మీటర్ల పరిధిలో బెల్టు షాపులను తొలగించాలని ఎక్సైజ్ శాఖ అధికారులకు సూచించారు. వివిధ ప్రాంతాల నుంచి గోవులను అక్రమంగా తరలిస్తున్న క్రమంలో పట్టుబడ్డ గోవులను సంరక్షించేందుకు చేపట్టాల్సిన చర్యలపై సైతం అధికారులు నిశితంగా చర్చించారు. కరకట్టపై రైలింగ్ మరమ్మతులు, భక్తులకు స్నానఘట్టాల వద్ద స్నానాలు చేసేందుకు ప్రత్యేక సదుపాయాలు సమకూర్చేందుకు ఇప్పటికే చర్యలు చేపడుతున్నట్లు గ్రామ పంచాయతీ అధికారులు పేర్కొన్నారు. పట్టణంలో ర్యాష్ డ్రైవింగ్ నియంత్రణకు ఇకపై కఠిన చర్యలు తప్పవని ఏఎస్పీ స్పష్టం చేశారు. ఈ క్రమంలో తొలి వారం రోజులు రవాణా, పోలీసు శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించనున్నారు. అనంతరం ర్యాష్ డ్రైవింగ్‌తో ఉల్లంఘనలకు పాల్పడే వారిపై చట్టపరంగా మరింత కఠినంగా చర్యలు తీసుకుంటామన హెచ్చరించారు. యూబీరోడ్డు, బ్యాంకు స్ట్రీట్, మసీదు రోడ్డు, పాత కూరగాయల మార్కెట్ ఎల్‌బీసీ రోడ్డు, రాజవీధుల్లో పగటిపూట ట్రాన్స్‌పోర్ట్ వాహనాలను నియంత్రించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దారు శ్రీనివాసరావు, సీఐ నాగరాజు, ఎస్‌ఐలు శ్రీనివాస్, పీవీఎన్‌రావు, మధుప్రసాద్, విజయలక్ష్మి, ఎంపీవో తిరుపతి, దేవస్థానం ఈఈ వి.రవీంద్రనాథ్, ఆర్‌అండ్‌బీ డీఈ హీరాలాల్, గ్రామ పంచాయతీ కార్యదర్శి సీహెచ్ శ్రీనివాసరావు, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రహీమున్నీసా బేగం ఇతర అధికారులు పాల్గొన్నారు.

325 మంది
స్టాఫ్ నర్సులుగా ఎంపిక

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 31: ఇటీవల మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ బోర్డ్ ద్వారా చేపట్టిన నియామకాల్లో రాష్ట్ర వ్యాప్తంగా 6956 మంది స్టాఫ్ నర్సులుగా ఎంపికవగా, అందులో జిల్లా నుంచి 325 మంది ఎంపికైనట్లు ఖమ్మం జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. బుధవారం ఎల్బీ స్టేడియం, హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రులు స్టాఫ్ నర్స్‌లకు నియామక పత్రాలు పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా నుంచి ఎంపికయిన వారిని పంపించినట్లు ఆయన తెలిపారు. అభ్యర్థుల్లో ఆరుగురు గురు దివ్యాంగులకు రెండు ఆర్బీఎస్కె వాహనాలు, ఇద్దరు లైజన్ అధికారులు, డీసీహెచ్ఎస్‌లతో, మిగిలిన వారిని, కొందరు అటెండెంట్లను తొమ్మిది బస్సుల ద్వారా పంపినట్లు ఆయన అన్నారు. వైరా, మధిర, సత్తుపల్లి నుంచి ఒక్కో రూట్, ఖమ్మం నుంచిఆరు రూట్లలో ఎవరికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రవాణాకు ఏర్పాట్లు చేశామన్నారు.

కామేపల్లి పీఏసీఎస్
చైర్మన్‌పై అవిశ్వాసం

కామేపల్లి, జనవరి 31: కామేపల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ తీర్థాల చిదంబరంపై 12మంది డైరెక్టర్లు తిరుబాటు చేసి అవిశ్వాస తీర్మానం చేశారు. వారు జిల్లా సహకార అధికారికి వినతిపత్రం అందజేశారు. సొసైటీలోని 13మంది డైరెక్టర్లలో 12మంది అవిశ్వాస తీర్మానంపై సంతకాలు పెట్టారు. వెంటనే సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పుచ్చకాయల వీరభద్రం, వైస్ చైర్మన్ కాట్రాల రోశయ్య, తుమ్మలపల్లి పెద్ద వీరయ్య, గుజ్జర్లపూడి రాంబాబు, పద్మ, పెంట్యా, యాదగిరి, నాగభూషణం, లక్ష్మి, వెంకటనర్సమ్మ, కరుణ ఉన్నారు.

దేవాలయ భూముల్లో
అక్రమ తవ్వకాలపై విచారణ

కూసుమంచి/ ఖమ్మం రూరల్, జనవరి 31: మండలంలోని జీళ్లచెరువులోగల శ్రీవెంకటేశ్వరస్వామి, రామాలయాలకు సంబంధించిన దేవుడి మాన్యాల్లో గల అక్రమ మట్టి తవ్వకాలపై దేవాదాయ, ధర్మాదాయశాఖ అధికారులు విచారణ నిర్వహించారు. ఆలయాలకు గ్రామంలో సుమారు 80 ఎకరాల భూమి ఉంది. ఈక్రమంలో గతంలో ఉన్న కొందరు నాయకులు మట్టిని అక్రమంగా తవ్వుకుని కోట్ల రూపాయల విలువ చేసే మట్టిని విక్రయించుకుని అక్రమంగా అమ్ముకున్నారని కొందరు ఇటీవల మంత్రి పొంగులేటికి, జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు మంత్రి ఆదేశాలతో దేవాలయశాఖ అసిస్టెంట్ కమీషనర్ సులోచన, ఇన్‌స్పెక్టర్ సమత, ఈవో నారాయణాచార్యులు తదితరులు పరిశీలించారు. ఈమేరకు విచారణ నివేదికను కలెక్టరుకు అందజేస్తామని అధికారులు తెలిపారు.

రాజీవ్ ట్రోఫీ విజేత వీఎం బంజర

- రన్నరప్‌గా ఖమ్మం అర్బన్ జట్టు



ప్రథమ బహుమతి సాధించిన వీఎం బంజర జట్టు, ద్వితీయ బహుమతి విజేత ఖమ్మం అర్బన్ జట్టు

ఖమ్మం స్పోర్ట్స్, జనవరి 31: నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో జరుగుతున్న రాజీవ్‌గాంధీ మెమోరియల్ రాజీవ్ ట్రోఫీ ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ముగిశాయి. టోర్నీలో విజేతగా వీఎం బంజర జట్టు నిలవగా రన్నరప్‌గా ఖమ్మం అర్బన్ జట్టు నిలిచింది. బుధవారం జరిగిన ఫైనల్స్ మ్యాచ్‌లో ఖమ్మం అర్బన్, వీఎం బంజర జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. మ్యాచ్‌లో టాస్ గెలిచి మొదటగా బ్యాటింగ్ చేసిన వీఎం బంజర జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 157 పరుగులు చేయగా అనంతరం చేజింగ్‌కు దిగిన ఖమ్మం అర్బన్ జట్టు 17.5 ఓవర్లలో 121 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయింది. దీంతో 31 పరుగుల తేడాతో వీఎం బంజర జట్టు విజయం సాధించి టైటిల్‌ను నిలబెట్టుకుంది.

మ్యాచ్‌లో అత్యధికంగా వీఎం బంజర జట్టు క్రీడాకారుడు బన్నీ 39 బంతుల్లో 54 పరుగులు చేశాడు. పోటీల అనంతరం విజేతలకు ఐఎన్‌టియూసీ జిల్లా అధ్యక్షుడు కొత్తా సీతారాములు, ప్రముఖ చిన్నపిల్లల డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్, డీవైఎస్‌వో పరంధామరెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో టోర్నీ నిర్వాహక కార్యదర్శి మతిన్, జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం సెక్రెటరీ ఓలేటి సాంబమూర్తి, హరిప్రసాద్, నరాల నరేష్, పమ్మి వెంకటేశ్వర్లు, జావెద్ అలీ, సలీం, మహిళా ఎంపైర్లు మమత, అంజలి, నవీన తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ నగర్‌లో
ఆక్రమణల కూల్చివేత



అటవీ అధికారులు కూల్చివేసిన ఇంటిని చూపుతున్న గ్రామస్థులు

మణుగూరుటౌన్, జనవరి 31: మణుగూరు మండలంలోని వీవీ కాలనీ సమీపంలో వైఎస్ఆర్ నగర్ ప్రాంతంలో నిర్మించిన తాత్కాలిక గృహాలను అటవీశాఖ అధికారులు కూల్చివేశారు. ఆ ప్రాంతంలో రెండు దశాబ్దాలకు క్రితం నిర్మించిన ఇళ్లకు అటవీశాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు. వైఎస్ఆర్‌నగర్‌లో అటవీశాఖ అధికారులు అటవీ భూముల్లో నిర్మించిన నిర్మాణాలను కూల్చివేసి ఆ ప్రాంతంలోని వారికి నోటీసులు ఇచ్చిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. 20 ఏళ్లకుపైగా ఈ ప్రాంతంలో ఇళ్లను నిర్మించుకుని జీవిస్తున్నామని వేడుకున్నా అటవీ అధికారులు వినకుండా గృహాలను ధ్వంసం చేసినట్లు తెలిసింది. బుధవారం వైఎస్ఆర్ నగర్ ప్రాంతాన్ని సందర్శించిన సామాజిక కార్యకర్త కె. రవి బాధితులను పరామర్శించి, అటవీ అధికారుల చర్యలను తీవ్రంగా ఖండించారు.

అటవీ భూములను ఆక్రమిస్తున్నారు..

ఈ విషయమై ఎఫ్ఆర్‌వో ద్వాలియాను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. రెండు రోజుల క్రితం వైఎస్ఆర్ నగర్ ప్రాంతంలో తాత్కాలిక గృహాలను నిర్మించి ఆటవీ భూములను ఒకొక్కరు దాదాపు అర ఎకరం నుంచి ఎకరానికి పైగా ఆక్రమించారని అన్నారు. ఆ ప్రాంతంలో ఆక్రమణలు పెరుగుతున్నాయన్న ఫిర్యాదులు మేరకు నూతనంగా తాత్కాలిక గృహా నిర్మాణాలను తొలిగించామని అన్నారు. అక్కడే ఆక్రమించి నివాసముంటున్న వారికి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.

కాపునకు రాని పామాయిల్ తోటల పరిశీలన

- సందర్శించిన శాస్త్రవేత్త ఎంవీ ప్రసాద్



పామాయిల్ చెట్లను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త, అధికారులు

సత్తుపల్లిరూరల్, జనవరి31: రైతుకు మేలు చేయాలనే ఉద్దేశ్యంతో నర్సరీలో మంచి మొక్కలను పంపిణీ చేస్తామని, నారాయణపురంలో పామాయిల్ మొక్కలను పరిశీలించామని, పూర్తి వివరాలను ఆయిల్‌ఫెడ్ కమిషనరేట్‌కు నివేదిస్తామని ఐవోపీఆర్ సీనియర్ సైంటిస్ట్ ఎంవీ ప్రసాద్ అన్నారు. సత్తుపల్లి మండలం నారాయణపురం గ్రామంలో కాపునకు రాని పామాయిల్ తోటలను బుధవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. రైతు పుచ్చకాయల సోమిరెడ్డి 2018లో తన 12ఎకరాలలో నాటిన పామాయిల్ తోటలో కొన్ని చెట్లు మధ్యలోనే చనిపోవడం, కాపునకు రాకపోవడంతో ఆయిల్‌ఫెడ్ కమిషనర్‌కు లేఖ ద్వారా తన ఆవేదనను వ్యక్తపరిచారు. దీంతో కమిషనర్ ఆదేశాల మేరకు తోటలను పరిశీలించేందుకు సత్తుపల్లి వచ్చినట్లు సైంటిస్ట్ ప్రసాద్ తెలిపారు. నివేదికను ఆయిల్‌ఫెడ్ కమీషనర్‌కు అందజేసి రైతుకు న్యాయం జరిగేలా చూస్తామని చెప్పారు.

పరిశీలనలో మొక్కలు

తాను పరిశీలించిన ప్రకారం సూచించిన యాజమాన్య పద్ధతులను పాటించినట్లయితే ఆరు నెలల్లో గెలలు కాపునకు వస్తాయని సైంటిస్ట్ ప్రసాద్ చెప్పారు. సోమిరెడ్డికి చెందిన 39మొక్కలను పరిశీలనలో ఉంచామని, ఆరు నెలల తర్వాత కాపును బట్టి ఒక అంచనాకు రావచ్చన్నారు. పామాయిల్ తోటలలో అంతర పంటలైన మామిడి చెట్లు, జీడి మామిడి, ఇతర పంటలు నిరూపయోగమన్నారు. కల్లింగ్ చేసిన మొక్కలను రైతులకు పంపిణీ చేసిన వాటిలో చేరాయనే ఆరోపణలను రైతులు అధికారుల ముందుంచగా ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేదని, ఒక ప్రత్యేక కమిటీ ద్వారా అలాంటి మొక్కలను నాశనం చేస్తున్నట్లు చెప్పారు. నష్టపరిహారం విషయంలో ఏ విధంగా ఉంటుందని ప్రశ్నించగా ఆ విషయం తమ పరిధిలోది కాదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి బీవీ రమణ, ఆయిల్‌ఫెడ్ డీవోలు భారతి, బాలకృష్ణ, ఎక్స్‌టెన్సన్ ఎస్‌వో రాజశేఖరరెడ్డి, రైతులు పుచ్చకాయల సోమిరెడ్డి, తుంబూరు కృష్ణారెడ్డి, ఒగ్గు అప్పిరెడ్డి, వేంపాటి లక్ష్మీనారాయణ, తుంబూరు ఉమామహేశ్వరరెడ్డి, దేశిరెడ్డి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవకుడికి
ఆర్థిక సాయం



రాధాకృష్ణకు ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే

సత్తుపల్లి, జనవరి31: కాలికిగాయమైన ఆర్‌కే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రాధాకృష్ణను ఆదుకునేందుకు ముందుకు వచ్చిన పేదల నేస్తం సేవా సంఘం సేవలు అభినందనీయమని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. సత్తుపల్లికి చెందిన సేవా సంస్థ సభ్యులు, సన్నిహితులు, మిత్రుల ద్వారా సేకరించిన మొత్తం రూ.41,124నగదును రాధాకృష్ణకు ఎమ్మెల్యే చేతులమీదుగా బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలడుగు దుర్గాప్రసాద్, గంధ్ర ఉషశ్రీ, నరేష్, అబీద్‌పాషా, భావన్, చైతన్య, కమల్‌పాషా, మానుకోట ప్రసాద్, వజ్రమ్మ, సైదేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

'పది'లో వందశాతం ఫలితాలు సాధించాలి

- విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ గౌతమ్



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, హాజరైన అధికారులు

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 31: పదోతరగతి ఫలితాలపై ప్రత్యేక దృష్టిసారించి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు విద్యార్థులను సమాయత్తం చేయాలని జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. ప్రాథమిక విద్యా ప్రమాణాలను పెంపొందించాలని ఆయన కోరారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పదో తరగతి గత సంవత్సరం ఫలితాలు, ఎఫ్ఎల్ఎం, డిసెంబరు నెల పరీక్ష ఫలితాలపై సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు, ఎంఈవోలు, మండల నోడల్ అధికారులు, ఎఫ్ఎల్ఎన్ రిసోర్స్ పర్సన్స్ సీపీడీ బృందం పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో కలెక్టర్ సమీక్షించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎఫ్ఏ1,2 మార్కుల సాధన, ఎస్.ఏ1 లో 80 నుండి 100 శాతం సాధించిన విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించి వారిని ఉత్తేజపర్చాలన్నారు. పబ్లిక్ పరీక్షలలో వంద శాతం ఫలితాల సాధనకు పాఠశాల స్థాయి కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, శిక్షణ అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్ సింగ్, డీఈవో సోమశేఖర శర్మ, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ విజయ వివిధ అధికారులు పాల్గొన్నారు.

జాలిముడి-గన్నవరం మధ్య వైరా నదిపై
హైలెవల్ వంతెన నిర్మించాలి




జాలిమూడి ప్రాజెక్టు

వైరా, జనవరి 31: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దు సమస్యను అధిగమించటంతో పాటు ఖమ్మం జిల్లాలో పలు ప్రాంతాలకు ప్రయాణదూరాన్ని తగ్గించేందుకు మధిర, వైరా మండలాల పరిధిలోని జాలిముడి-గన్నవరం మధ్య వైరా నదిపై హైలెవల్ వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చొరవ తీసుకొని ఈ వంతెన నిర్మాణానికి త్వరలో ప్రవేశపెట్టే బడ్జెట్లో నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మధిర నియోజకవర్గ పరిధిలోని జాలిముడి ఆనకట్ట ప్రాజెక్టు వద్ద వైరా నదిలో ఈ హైలెవల్ వంతెన నిర్మాణం వలన మధిర, వైరా నియోజకవర్గాల్లోని ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. భట్టి విక్రమార్క ఉమ్మడి ఏపీలోని ప్రభుత్వ చీఫ్‌విప్, డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న సమయంలో వైరా నదిపై జాలిముడి ప్రాజెక్టును నిర్మించారు. ఈ జాలిముడి ప్రాజెక్టు వలన బ్యాక్‌వాటర్‌తో మధిర, వైరా మండలాల్లోని పలు గ్రామాలతోపాటు ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాలో ఉన్న పలు గ్రామాల్లోని భూములకు సాగునీటి సమస్య లేకుండా పోయింది. భూగర్భజలాలు కూడా పెరిగాయి. అయితే 2014లో రాష్ట్ర పునర్విభజన జరిగి తెలంగాణ, ఏపీ రాష్ట్రాలు విడిపోయాయి. జిల్లా కేంద్రమైన ఖమ్మం నుంచి ఉన్నతాధికారులు నేరుగా జాలిముడి ఆనకట్టను సందర్శించేందుకు గానూ వైరా నుంచి వెళ్లే సమయంలో ఎన్టీఆర్ జిల్లాలోని నెమలి నుంచి అక్కడకు చేరుకోవాల్సి వస్తుంది. మధిర మండలంలోని రొంపిమళ్ల, మల్లారం, జాలిముడి రైతుల భూములు వైరా మండలంలోని గన్నవరం రెవెన్యూ పరిధిలో ఉన్నాయి. వానాకాలంలో వైరా నది దాటి ఈ గ్రామాల రైతులు తమ భూములకు రావడానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

తల్లాడ మండలంలో ఎమ్మెల్యే రాగమయి పర్యటన

తల్లాడ, జనవరి 31: తల్లాడ మండలంలో బుధవారం ఎమ్మెల్యే మట్టా రాగమయి విస్తృతంగా పర్యటించారు. తల్లాడలో మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. స్థానిక రైతువేదికలో కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. గోపాలపేటలో ఎస్సీ కమ్యూనిటీహాల్‌ను ప్రారంభించారు. తల్లాడ, అన్నారుగూడెం, గోపాలపేట, కలకొడిమ సర్పంచ్‌లు పొట్టేటి సంధ్యారాణి, మారెళ్ల మమత, నల్లమోతు మోహన్‌రావు, ఆదూరి దానూరావు, పేర్లపుట్ట స్వరాజ్యం, కవితలను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, జడ్పీటీసీ దిరిశాల ప్రమీల, తహసీల్దార్ వి.రవికుమార్, ఎంపీడీవో కొండపల్లి శ్రీదేవి, ఎంపీటీసీలు దగ్గుల రఘుపతిరెడ్డి, చల్లా తిరుమలాదేవి, కాంగ్రెస్, టీడీపీ మండల నాయకులు కాపా సుధాకర్, కూచిపూడి వెంకటేశ్వర్లు, గోవింద శ్రీనివాసరావు, రాయల రాము, సామినేని రామఅప్పారావు పాల్గొన్నారు.



ఆ హోదా ఓ జ్ఞాపకం

ముగిసిన సర్పంచ్‌ల పదవీ కాలం

ఘనంగా వీడ్కోలు వేడుకలు

సర్పంచ్‌ల పదవీకాలం బుధవారంతో ముగిసింది. ఇక నుంచి ఎంపీపీలు, సర్పంచ్‌లు మాజీలుగా మారిపోయారు. ఇకపై ఆ పదవి, హోదా వారికి ఓ జ్ఞాపకం.. ఈ నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా బుధవారం వారికి ఘనంగా వీడ్కోలు పలికారు. వారి సేవలను కొనియాడారు. కాగా రఘునాథపాలెం మండలంలో వినూత్నంగా అక్కడి సర్పంచులు చివరిగా కొన్ని పనులకు శంకుస్థాపనలు చేశారు. మధుర జ్ఞాపకంగా మిగుల్చుకున్నారు. - నెట్‌వర్క్



రఘునాథపాలెంలో శంకుస్థాపన చేస్తున్న సర్పంచులు



రూరల్‌మండలంలో..



సత్తుపల్లి ఎంపీపీ హైమావతి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం



ఎర్రుపాలెంలో..



కల్లూరులో..



కామేపల్లిలో..







లచ్చగూడెం సర్పంచ్‌ను సన్మానిస్తున్న దృశ్యం,మేడేపల్లిలో సర్పంచ్ రమేష్ దంపతుల సన్మానం, తిరుమలాయపాలెం సర్పంచ్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- రెవెన్యూ శాఖామంత్రి పొంగులేటి
- సమస్యలు విని అర్జీలు స్వీకరించిన మంత్రి
- విత్తన కంపెనీపై కేసు నమోదుకు ఆదేశం

కూసుమంచి, జనవరి31: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రెవిన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం కూసుమంచి మండలంలో పర్యటించారు. పాలేరు క్యాంపుకార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ప్రజాదర్బార్ నిర్వహించారు. సుమారు 5గంటలకు పైగా అర్జీలు స్వీకరించారు. అధికారులకు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలని ఆదేశించారు.

విత్తన కంపెనీపై పీడీయాక్ట్ నమోదుకు ఆదేశం

నేలకొండపల్లి మండలం చెరువుమాధారం గ్రామంలో 60 రోజులకే వరికంకులు రావడంతో నష్టపోయినట్లు రైతులు మంత్రి దృష్టికి తీసుకవచ్చారు. వెంటనే స్పందించిన మంత్రి జేడీఏతో ఫోన్‌లో మాట్లాడి పీడీ యాక్ట్ ద్వారా విత్తన కంపెనీపై కేసునమోదు చేయాలని ఆదేశించారు. రాజేశ్వరపురం గ్రామంలో చెరువుశిఖం పట్టాభూముల సర్వేచేసి పరిష్కరించాలన్నారు. రాజుపేటలో ఖబరుస్తాన్ ప్రహరీగోడ, రెండు విద్యుత్‌స్తంబాలు అవసరం ఉన్నాయని చెప్పగా వెంటనే ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. కేశవాపురంలో ప్రభుత్వ భూమి కబ్జాకుగురయిందని చెప్పగా వెంటనే చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను ఆదేశించారు. అనంతరం కూసుమంచి, తీర్థాల జాతరకు శివాలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూధన్, ఖమ్మంఆర్డీవో గణేష్, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్యామ్‌ప్రసాద్, ఎండోమెంట్ కమీషనర్ సులోచన, ఫిషరీస్ ఏడీ ఆంజనేయస్వామి, మిషన్‌భగీరథ ఈఈ వాణిశ్రీ, విద్యుత్ ఏడీ కోక్యానాయక్, టీపీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు, చరణ్‌రెడ్డి, జొన్నలగడ్డ రవికుమార్, రామా శ్రీను, యడవల్లి రాంరెడ్డి, సుధాకర్‌రెడ్డి, బజ్జూరి వెంకటరెడ్డి, హఫీజుద్దీన్ పాల్గొన్నారు.



చెక్కు పంపిణీ చేస్తున్న మంత్రి పొంగులేటి

హోమియో ఆసుపత్రికి మంత్రి పొంగులేటి శంకుస్థాపన

కూసుమంచి: ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలందించాలని తెలంగాణ రెవిన్యూశాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. బుధవారం కూసుమంచిలో రూ.15లక్షలతో హోమియోఆసుపత్రికి మంత్రి శంఖుస్థాపన చేశారు. మండలంలోని బురేన్‌గుట్టతండా నుంచి గోరీలపాడుతండా వరకు, రాజుపేట, పెరికశింగారం నుంచి గోరీలపాడుతండా వరకు రహదారులన నిర్మానానికి శంకుస్థాపన చేశారు. కూసుమంచి మాజీసర్పంచి జర్పుల మున్యానాయక్ కుటుంబాన్ని, నేలపట్ల మాజీసర్పంచి హనుమంతరావు కుటుంబాన్ని పరామర్శించారు. ఆయనవెంట డీఎం హెచ్‌వో రామూనాయక్, హోమియోవైద్యులు ధారావత్ కృష్ణ, మండల వైద్యాధికారి కిషోర్, ఎంపీపీ బాణోతు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఖమ్మంరూరల్: మండల పరిధిలోని తెల్దారుపల్లిలో నిర్మించిన కాంగ్రెస్‌పార్టీ గద్దెను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం ప్రారంభించారు. కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. ముందుగా దివంగత నేత తమ్మినేని కృష్ణయ్య ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అనంతరం తమ్మినేని కృష్ణయ్య విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తమ్మినేని నవీన్, రాయల నాగేశ్వరరావు, రాంరెడ్డి చరణ్‌రెడ్డి, మద్దినేని స్వర్ణకుమారి, బండి జగదీశ్, గరికపాటి వెంకట్రావు, కళ్లెం వెంకటరెడ్డి, సురేష్ పాల్గొన్నారు. కాగా గ్రామ పంచాయతీ కార్మికులు సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

తక్కువ ఓట్లు పోలైన కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టండి

నగరపాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి

ఖమ్మంకార్పొరేషన్,జనవరి31: తక్కువ ఓట్లు పోలైన కేంద్రాలపై దృష్టి పెట్టాలని,ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓట్లశాతం పెరిగేలా కృషి చేయాలని నగరపాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి కోరారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024, ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ తదితర అంశాలపై బుధవారం నగరపాలకసంస్థ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఆప్పటివరకు అందిన పారంనెంబర్ 6,7,8 వివరాలను, సదరు ధరఖాస్తులపై తీసుకున్న చర్యలను కమిషనర్ ఈ సమావేశంలో తెలియచేశారు. స్పెషల్ సమ్మరీ 2024, ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్‌ను వివరించారు. అనంతరం తక్కువ ఓటింగ్ నమోదైన పోలింగ్ కేంద్రాల వివరాలను తెలిపారు. ఆయా కేంద్రాల్లో వచ్చే ఎన్నికల్లో ఎక్కువ ఓటింగ్ జరిగేలా తీసుకోవాల్సిన చర్యలను గురించి ప్రతినిధులు అభిప్రాయాలను కోరారు.

రాజకీయ పార్టీలతో ఆర్డీవో సమావేశం

సత్తుపల్లిరూరల్: ఓటర్ల తుది జాబితా ప్రకటించిన తరువాత పలు రాజకీయ పార్టీల నాయకులతో ఎలక్టోరల్ రిటర్నింగ్ అధికారి, కల్లూరు ఆర్డీవో ఎస్.అశోకచక్రవర్తి బుధవారం సమావేశమయ్యారు. సత్తుపల్లి తహసీల్ధార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎవరినైనా ఓటరు జాబితాలో పేరు లేకపోతే సరిచూసుకోవాలన్నారు. ఓటర్ల జాబితాను రాజకీయ పార్టీల నాయకులకు అందించామన్నారు. ఎక్కడైనా పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించాలని గుర్తిస్తే చెప్పవచ్చన్నారు. శాసనమండలి దరఖాస్తుల స్వీకరణ ఈనెల 6వ తేదీ అని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎలక్టోరల్ అధికారి, తహసీల్దార్ కే.యోగీశ్వరరావు, గిర్ధావర్లు నరేష్, జానీమియాల పాల్గొన్నారు.

సైబర్‌నేరాలపై విద్యార్థులకు అవగాహన

ఖమ్మంఖానాపురంహవేలి,జనవరి31: సైబర్ మోసగాళ్లు సాంకేతిక పరిజ్ఞానాని అనుకూలంగా మార్చుకొని అమాయకులను మోసం చేస్తున్నారని సైబర్ క్రైమ్ ఎస్ఐ రంజిత్ అన్నారు. బుధవారం ఎస్‌బీఐటీ కళాశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లింగయ్య, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు

ఏన్కూరు, జనవరి31: మండలంలోని లచ్చగూడెం గ్రామంలోని ఆంజనేయస్వామి వారిని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ దర్శించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే ప్రత్యేక పూజల్లోపాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వాసిరెడ్డి నాగేశ్వరరావు, ఎంపీటీసీ లచ్చిరాంనాయక్, గిద్దగిరి సత్యనారాయణ, నల్లమల శివకుమార్, మేడ ధర్మారావు, మహేష్, రమేష్, సాయి, రోహిత్ పాల్గొన్నారు

ల్యాప్ టాప్ వితరణ

వైరా, జనవరి 31: వైరా గ్రేట్ విజన్ క్లబ్ ఆధ్వర్యంలో బీటెక్ చదువుతున్న వైరాకు చెందిన పానుగంటి శశికిరణ్‌కు ల్యాప్‌టాప్ అందజేశారు. ఆరోవార్డు కౌన్సిలర్ లగడపాటి లక్ష్మీరాజ్యం, ప్రభాకర్‌రావు ఆర్థికసాయం, లయన్స్ విద్యాట్రస్టు తోడ్పాటుతో ఈ ల్యాప్‌టాప్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఉంద్రు వరలక్ష్మీ, డాక్టర్ కాపా మురళీకృష్ణ, ఉంద్రు శ్యాంబాబు, లగడపాటి ప్రభాకర్‌రావు, గంగవరపు కిషన్, పుల్లారావు, మహాలక్ష్మీ, గోపి పాల్గొన్నారు.

రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ

వైరా,జనవరి31: మహాత్మాగాంధీ వర్థంతిని పురస్కరించుకొని వైరాలోని ఠాగూర్, మధు విద్యాలయాలు, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, మేరీ ఇమాక్యులేట్ పాఠశాలల్లో విద్యార్థులు రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేశారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు కోట ప్రేమ్‌కుమార్, చిత్తారు మురళీ, విక్రాంత్, వెంకటేష్, సాయిఫణీంద్ర, రాహుల్, అజయ్ పాల్గొన్నారు.

వైరా ఎంపీడీవోకు సన్మానం



వైరా, జనవరి 31: జిల్లా ఉత్తమ ఎంపీడీవోగా అవార్డు తీసుకున్న వైరా ఎంపీడీవో డి.కరుణాకర్‌రెడ్డిని బుధవారం ఉద్యోగులు సన్మానించారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎంపీడీవో కరుణాకర్‌రెడ్డిని సత్కరించారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, మండలపరిషత్ సిబ్బంది, ఐకేపీ, ఈజీఎస్ తదితరశాఖల అధికారులు కరుణాకర్‌రెడ్డిని అభినందించారు. ఎంపీవో జ్యోత్స్నదేవి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

తమ్మినేనికి సీపీఎం నాయకుల పరామర్శ

ఖమ్మంరూరల్, జనవరి31: మండలంలోని సీపీఎం పార్టీ నాయకులు బుధవారం హైదరాబాద్‌వెళ్లి తమ్మినేని వీరభద్రాన్ని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెల్దారుపల్లి సర్పంచ్ సిద్దినేని కోటయ్య, నాయకులు డాక్టర్ వెంకటేశ్వర్లు, రాయల వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం ఎన్నిక

పెనుబల్లి, జనవరి 31: ఐఎన్‌టీయూసీ అనుబంధంగా ఖమ్మంజిల్లా ఉపాధి హామీ పథకం ఫీల్డ్‌అసిస్టెంట్ల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా కొత్తా సీతరాములు, అధ్యక్షుడిగా పెనుబల్లికి చెందిన కర్రీ సదానందరావు, ఉపాధ్యక్షులుగా ఎస్‌డీ.సిలార్‌తోపాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

ప్రత్యేక అధికారులకు అవగాహన సదస్సు

పెనుబల్లి, జనవరి 31: గ్రామపంచాయతీల సర్పంచ్‌ల పదవీకాలం గురువారం ముగియనుండటంతో వారి స్థానంలో ప్రత్యేక అధికారులుగా నియమించబడిన అధికారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీల పాలనావిధానాలు, వారు నిర్వహించవల్సిన విధుల గురించి డీఎల్‌పీవో వి.ప్రభాకర్‌రావు అవగాహన కల్పించారు.

ధాన్యం డబ్బుల కోసం రైతుసంఘం ధర్నా

వైరా, జనవరి31: తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో బుధవారం వైరా రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం డబ్బులు వెంటనే రైతుల ఖాతాల్లో జమచేయాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ కార్యాలయంలో గండగలపాడు రైతులతో కలిసి ధర్నా అనంతరం వినతిపత్రం సమర్పించారు. రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, కిలారు శ్రీనివాసరావు, పైడిపల్లి సాంబశివరావు, కామినేని రవి, చిత్తారు మురళీ, పల్లెబోయిన కృష్ణ, పుచ్చకాయల రామయ్య, పొన్నేకంటి కొండల్‌రావు, గొడ్ల లక్ష్మయ్య, బెజవాడ మల్లయ్య, అమరనేని వేణు, యనమద్ది రామకృష్ణ, ప్రేమ్, సునీల్ పాల్గొన్నారు.

టవర్ నిర్మాణం ఆపాలని వినతి

కొణిజర్ల,జనవరి31: వైరా మునిసిపాలిటి పరిధిలోని 15వ వార్డు కొణిజర్ల మండలం దిద్దుపుడిలో ఏర్పాటు చేస్తున్న టెల్ టవర్ నిర్మాణం నిలిపేయాలని బుధవారం స్థానికులు వైరా మునిసిపల్ చైర్మన్ సూతగాని జైపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, కృష్ణ, రాంబాబు, కృష్ణయ్య, భద్రయ్య, గోపాల్, అచ్యుతరావు, మధు, రామకృష్ణ, బాలకృష్ణ, నరేందర్, పుల్లయ్య, జగన్నాధం, నరేష్ తదతరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ గల నాయకుడు లాలయ్య

కొణిజర్ల, జనవరి31: క్రమశిక్షణ గల నిబద్దత నాయకుడు అచ్చన లాలయ్య అని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి కొనియాడారు. మండల పరిధిలోని పెద్దమునగాలలో బుధవారం జరిగిన అచ్చన లాలయ్య వర్థంతిసభలో జెండా ఆవిష్కరణ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు యర్రాబాబు, మండల కార్యదర్శి వేములకొండ రమేష్, వేమిరెడ్డి రామిరెడ్డి, పాపగంటి సుదర్శన్, కోటేశ్వరరావు, వెంకటి, మురళి, శ్రీను, పిచ్చయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

ప్రేమ వ్యవహారంలో స్నేహితులపై దాడి

ఖమ్మంక్రైం,జనవరి 31: పేమ వ్యవహారంలో ముగ్గురు స్నేహితులపై యువతి బంధువులు దాడి చేశారు. రోటరీనగర్ ప్రాంతానికి చెందిన 17ఏళ్ల బాలుడు టేకులపల్లి ప్రాంతానికి చెందిన 19ఏళ్ల యవతి ప్రేమించుకుంటున్నారు. రెండురోజుల క్రితం వారు ఇంటినుంచి వెళ్లారు. దీంతో యువతి కుటుంబ సభ్యులు ఆ బాలుడు స్నేహితులపై దాడిచేశారు. బాధితుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఘనంగా గద్దర్ జయంతి



నివాళులు అర్పిస్తున్న పలు సంఘాల నాయకులు

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి31:ప్రజాకవి గద్దర్‌కు ఖమ్మం జిల్లాతో విడదీయరాని అనుభందం ఉందని తన ఆట, పాటతో జిల్లాలో రాష్ట్ర సాధన ఉద్యమానికి ఊపిరి పోశారని ప్రజా ఉద్యమ సంఘాల బాధ్యులు అరపల్లి విద్యాసాగర్‌రావు, గుంతేటి వీరభద్రం, గోపగాని శంకర్‌రావు, కాకి భాస్కర్‌లు పేర్కొన్నారు. బుధవారం ఖమ్మంలో పూలే ప్రాంగణంలో దేవిరెడ్డి విజయ్ అధ్యక్షతన గద్దర్ జయంతి వేడుకల సభను నిర్వహించారు.

టీసీఎస్‌కు శ్రీచైతన్య విద్యార్థుల ఎంపిక



ఖమ్మంరూరల్, జనవరి 31: స్థానిక ఖమ్మం రూరల్ మండలంలోని పొన్నెకల్లులోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కాలేజి విద్యార్థులు ప్రముఖ టీసీఎస్ కంపెనీలో 33 మంది ఎంపియ్యారని కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయిగీతిక తెలిపారు. కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ విభాగ సిబ్బందిని, వివిధ విభాగాల అధిపతులను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ శ్రీవిద్య, సీఈవో, వివిధ విభాగాల అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



ఖమ్మంలీగల్, జనవరి 31: పాత పెన్షన్ సాధించడమే ఏకైక ఎజెండాగా ముందుకు వెళ్తున్న టీఎస్‌సీపీఎస్‌ఈయును జిల్లా ప్రధాన న్యాయాధికారి బి.ఎస్.జగ్జీవన్‌కుమార్ అభినందించారు. బుధవారం జిల్లా న్యాయస్థానాల సముదాయంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి కె.ఉమాదేవి , ఇతర న్యాయయూర్తులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

నేలకొండపల్లి, జనవరి31: మండల పరిషత్ కార్యాయంలోని సమావేశ మందిరంలో బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఉదయం 11గంటలకు సమావేశం జరగాల్సి ఉండగా దాదాపు 1.30 గంటలు ఆలస్యంగా సమావేశం ప్రారంభమైంది. బుధవారం కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి పాల్గొనటంతో కాంగ్రెస్‌కు చెందిన ఎంపీటీసీలు మంత్రి కార్యక్రమానికి వెళ్లటం. ఇతర ఎంపీటీసీలు సమయానికి రాక పోవటంతో కోరం లేక సమావేశం ఆలస్యంగా ప్రారంభమైంది. మండల సర్వసభ్య సమావేశం గత సమావేశాలకు భిన్నంగా సాదాసీదాగా జరగటం విశేషం. సమావేశంలో ఎంపీపీ వజ్జా రమ్య, జడ్పీటీసీ, జడ్పీ ఉపాధ్యక్షురాలు మరికంటి ధనలక్ష్మి, ఉపాధ్యక్షుడు పతానపు నాగయ్య, ఎంపీడీఓ జమలారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో బెల్ట్ షాపులను మూసివేయారా?

కామేపల్లి, జనవరి31: గ్రామాల్లో బెల్ట్‌షాపులను మూసివేయారా అని ఎక్సైజ్‌శాఖ ఎస్‌ను ప్రజా ప్రతినిధులు నిలదీశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బానోత్ సునీత అధ్యక్షతన సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. అన్నిశాఖలపై అభివృద్ధి, ప్రగతిపై సమావేశంలో చదివి వినిపించారు. గ్రామాల్లో ఆటోల ద్వారా మద్యం అమ్మకాలు జరుగుతున్నా, పట్టించుకోవడంలేదని ఎక్సైజ్ ఎస్ఐను ఎంపీటీసీ గబ్బూనాయక్ అడిగితే ఎవరు కంప్లైంట్ చేయడంలేదుగా అని సమాధానం చెప్పడు గమనార్హం. మీరు ప్రజల కోసం పని చేస్తున్నారా లేక వైన్ షాపుల యాజమానుల కోసం పని చేస్తున్నారా అని ప్రశ్నించాడు. ఈ సమావేశంలో తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీఓ విజయభాస్కర్‌రెడ్డి, వైఎస్ ఎంపీపీ విజయలక్ష్మి, ఎంపీటీసీ హేమామాలిని, శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్ ఓవర్ వంతెనలు నిర్మించాలి

ఖమ్మం మామిళ్లగూడెం, జనవరి31: ఖమ్మం నగరంలో రద్దీ పెరగటం మూలంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చేటువంటి ప్రజలు తరచూ ప్రమాదాలకు గురి అవుతున్నారనిరద్దీకి తగినట్లుగా కూడళ్లలో ఫుట్ ఫ్లైఓవర్ వంతెనలను నిర్మించాలని ఖమ్మం నగర కమిషనర్‌కు తెలుగుదేశం పార్టీ నాయకులు విన్నవించారు. బుధవారం కమీషనర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందచేశారు. కమీషనర్‌ను కలిసిన వారిలో తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కొండబాల కరుణాకర్, లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లెంపాటి అప్పారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి నాగార్జున శ్రీనివాస్, తెలుగు మహిళా రాష్ట్రఅధికార ప్రతినిధి చుండూరు రాజరాజేశ్వరి, గడిపూడి వెంకటేశ్వరరావు, పాలడుగు క్రిష్ణప్రసాద్, పద్మ నాబుల నారాయణరావు , రాయల కోటేశ్వరరావు, కర్నాటి అశ్వనికుమార్, చావారామారావు, నల్లమోతు సత్యనారాయణ, చావా అజయ్ పాల్గొన్నారు.

తాటి, ఈత చెట్లను నరికే వారిపై చర్యలు తీసుకోవాలి

ఖమ్మంరూరల్,జనవరి31: కల్లుగీత కార్మికుల జీవనాదారమైన తాటి, ఈత చెట్లను నరికే వారిపై ఎక్సైజ్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కమిటి సభ్యులు కొండం కరుణాకర్ పేర్కొన్నారు. మండల పరిదిలోని గోళ్లపాడులో కల్లుగీత కార్మిక సంఘం కార్యాలయంలో ఖమ్మంజిల్లా కల్లుగీత కార్మిక సంఘం క్యాలెండర్‌ను బుధవారం ఆవిష్కరిం చారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, సంగయ్య, రమేష్, శ్రీను, రవి, సుదర్శన్, నాగయ్య పాల్గొన్నారు.

అన్నదానికి రూ. 9వేలు వితరణ

కామేపల్లి,జనవరి31: మండల పరిధిలోని తాళ్లగూడెం గ్రామంలో శ్రీలక్ష్మి తిరుపతమ్మ అమ్మవారి మాల దీక్ష దారుల అన్నప్రసాదానికి అదే గ్రామానికి చెందిన పుచ్చకాయల నవ్య పుట్టిన రోజుల సందర్బంగా రూ.9 వేలు వితరణ చేశారు. దీంతో గురువారం అన్నదాన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.

కేలండర్ ఆవిష్కరించిన సీపీ

ఖమ్మంక్రైం, జనవరి31: నగరంలోని సీపీ కార్యాలయంలో రిటైర్డు పోలీసు అధికారుల సంఘం క్యాలెండర్‌ను పోలీసుకమిషనర్ సునీల్‌దత్ బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాధాకృష్ణమూర్తి, రుద్ర వెంకటనారాయణ, సోమయ్య, నాగేశ్వరరావు, సంజీవరావు, సుధాకర్, రంగారావు, ఖాసీమ్ పాల్గొన్నారు.

'అభివృద్ధిలో వైరా నియోజకవర్గాన్ని ముందుంచుతాం'

కొణిజర్ల,జనవరి31:అభివృద్ధిలో వైరా నియోజకవర్గాన్ని ముందుంచుతానని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే మండలంలోని పెద్దగోపతి, చిన్నగోపతి గ్రామాలలో పల్లెదావాఖానాలను, పంచాయతీ కార్యాలయాన్ని, సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోసు మధు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు దానియేలు, చిరంజీవి, బూరప్రసాద్, వడ్డే రమాదేవి, కాంగ్రెస్ పీసీసీ సభ్యులు వడ్డే నారాయణరావు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పెద్దగోపతిలో వాగ్వాదం

పెద్దగోపతిలో వేదికపై ఎమ్మెల్యేను సన్మానించేందుకు రంజిత్ వస్తుండగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డే నారాయణరావు కల్పించుకున్నారు. నిన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేశామని అడ్డుకున్నారు. దీంతో రంజిత్ కొంతమంది వాదించారు. దాంతో ఎమ్మెల్యే కల్పించుకొని తర్వాత చూద్దామనంతో వివాదం సద్దుమనిగింది.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తాం

- ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, జనవరి31: రాష్ట్రప్రభుత్వం విశ్రాంత ఉద్యోగుల సమస్యలను త్వరలో పరిష్కరిస్తుందని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పేర్కొన్నారు. బుధవారం వైరాలో ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పెన్షనర్స్‌డేలో ఎమ్మెల్యే ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, వైరా ట్రెజరీ అధికారులు ప్రసన్న కుమార్, వేలాద్రి, జడ్పీటీసీ నంబూరి కనకదుర్గ, ఎస్‌బీఐ మేనేజర్ హన్మంత్ నాయక్, రిటైర్డ్ ఉద్యోగసంఘం నాయకులు





ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగులు, అల్పాహారాన్ని పెడుతున్న ఎమ్మెల్యే

పి.సత్యనారాయణ, టీవీ. కృష్ణయ్యసూరి, కల్యాణం కృష్ణయ్య, పైడిపల్లి శరత్‌బాబు, చల్లా కృష్ణారావు, సామినేని వెంకటేశ్వరరావు, షేక్.వలీజాన్, పి.వెంకటేశ్వర రావు, శశిభూషణ్, సుబ్బయ్య, శారదా, అరుణ పాల్గొన్నారు.

అల్పాహారాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

కొణిజర్ల: మండలంలోని పెద్దగోపతి ఉన్నత పాఠశాలలో బుధవారం సాయంత్రం పదో తరగతి ర్థులకు అల్పాహారాన్ని ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ప్రారంభించారు. విద్యార్థులకు అల్పాహారాన్ని ఇవ్వడానికి ముందుకు వచ్చిన గ్రామ ఎంపీటీసీ వడ్డే రమాదేవి, నారాయణరావులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోసు మధు, కాంగ్రెస్ పీసీసీ సభ్యులు వడ్డే నారాయణరావు, గ్రామ సర్పంచ్ తడికమళ్ళ దానియేలు, కిషోర్, రంజిత్ పాల్గొన్నారు.